T.T.D. Religious Publications Series No.911
Price :

Published by **Sri L.V. Subrahmanyam,** I.A.S., Executive Officer,
T.T.Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

"బ్రహ్మ మొక్కటే" గ్రంథమాల

"వళ్ళలార్"

# జ్యోతి రామలింగస్వామి

ఆచార్య పి.వి.అరుణాచలం



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

"బ్రహ్మ మొక్కటే" గ్రంథమాల

"వళ్ళలార్"

# జ్యోతి రామలింగస్వామి


**రచన**

## ఆచార్య పి.వి.అరుణాచలం



ప్రచురణ

కార్యనిర్వహణాధికారి,

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2012**

**VALLALAR**
**Jyothi Ramalingaswamy**

**by**
**Prof. P.V.Aruna Chalam**

T.T.D. Religious Publications Series No. 911

© All Rights Reserved

*First Edition:- 2012*

Copies: 3000

*Published by :*
**L.V. SUBRAHMANYAM**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P:*
Editor in Chief Office,
T.T.D., Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517507

# ముందుమాట

**భా**రతదేశంలో అనాదిగా ఆ యా కాలాల్లో, ఆ యా కులాల్లో, ఆ యా ప్రాంతాల్లో అవతరించిన మహనీయులు ఎందరో మనకు దర్శనమిస్తారు. ఆ మహాపురుషులు అందరు వారి వారి కాలాల్లోని వివిధ పరిస్థితుల్లో కేవలం మనుగడ సాగించడం మాత్రమేగాక మానవోద్ధరణకు కృషి చేశారు. తద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యంతోపాటు ఆధ్యాత్మిక వికాసానికి కూడా ఆ మహామనీషులు ఎంతగానో తోడ్పడ్డారు.

అలాంటి మహాత్ముల జీవితగాథలను, వారు ప్రబోధించిన జీవన సత్యాలను, ఆధ్యాత్మిక సందేశాలను భక్తులకు అందించాలన్న తలంపుతో తిరుమల తిరుపతి దేవస్థానం **"బ్రహ్మమొక్కటే"** అనే శీర్షిక క్రింద ఒక గ్రంథమాలను ప్రారంభించింది. అందు కనుగుణంగా కొందరు పండితుల చేత అలాంటి మహాపురుషుల జీవనరేఖలను చిత్రించే గ్రంథాలను రాయించి ప్రచురించాలని సంకల్పించింది.

అందులో భాగంగా ప్రస్తుతం ఆచార్య పి.వి.అరుణాచలంగారు రచించిన **"వళ్ళలార్ - జ్యోతి రామలింగస్వామి"** అన్న పుస్తకాన్ని అందజేస్తున్నాము. ఈ గ్రంథ పఠనం ద్వారా, పిల్లలు, పెద్దలు ఆధ్యాత్మికచైతన్యవంతులు కావాలని ఆకాంక్షిస్తూ..

సదా శ్రీవారి సేవలో....
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

## “వళ్ళలార్”

# జ్యోతిరామలింగస్వామి

అనాదిగా ఈ విశాల ప్రపంచంలో అక్కడక్కడ, అప్పుడప్పుడు మహాత్ములుదయించి, లోకోపకారజీవితాలను వెలయించి, జ్ఞాన జ్యోతులను పంచిన మహిమాన్విత చరిత్రలు మనం చదువుకుంటున్నాము– ఈ కోవకు చెందిన మహనీయులు శ్రీ జ్యోతి రామలింగస్వాములవారు. వారి మహిమ తమిళదేశమంతా వ్యాపించింది, ఎందుకంటే వారు చిదంబరం దగ్గర జన్మించి, కడలూరు దగ్గర వడలూరు కార్యక్షేత్రంగా ప్రసిద్ధి కెక్కినవారు. అట్టి వారి రచనలు, వారిని గురించిన రచనలు చాలవరకు తమిళంలో, కొంత ఆంగ్లంలో ఉన్నాయి. తెలుగులో దానిని గురించి విద్వాన్ పుల్లూరి మునిరత్నపిళ్ళగారు 1947లో ఒక చిన్నపుస్తకం వ్రాశారు. ఆ పుస్తకాన్ని ఒకసారి తిరుపతిలో పునర్ముద్రించడం జరిగింది. ఈ నేపథ్యంలో తెలుగునాట జ్యోతిరామలింగస్వాములను గురించి తెలిసినవారు వ్రేళ్ళతో లెక్కించవచ్చు.

రామలింగస్వామి పేరు ప్రస్తావనకు వస్తే వెంటనే తమిళదేశంలో “అరుట్పెరంజ్యోతి, తనిప్పెరుం కరుణై” అని స్వామిని జ్ఞాపకం చేసుకుంటారు. బుద్ధదేవునిలో కరుణశ్రీని చూచినట్లు రామలింగస్వామిలో మూర్తీభవించిన కారుణ్యాన్ని దర్శించారు. సమకాలికులు– తమిళంలో స్తుతి రూపంలోని పదబంధాలు “అరుట్పెరం..., కరుణ” లను “కృపామహాజ్యోతి” అని “పృథగ్భూత కారుణ్యమ”ని విద్వాన్ మునిరత్నపిళ్ళగారు తెలుగున పేర్కొన్నారు.

పంచభూతాలైన పృథివి, వాయువు, అప్పు, తేజస్సు, ఆకాశములకు ప్రతీకలైన పంచభూతలింగక్షేత్రాలు కాంచీపురం (లేదా తిరువారూరు), శ్రీకాళహస్తి, తిరువానైక్కావల్, తిరువణ్ణామలై, చిదంబరాలు–వీటిలో భరతమాతకు హృత్పద్మంగా వెలసిన సర్వోత్కృష్ట దివ్యక్షేత్రం చిదంబరం. “చిదంబర రహస్య” మన్న తెలుగు నానుడి వల్ల ఆ క్షేత్రప్రాశస్త్యాన్ని తెలుగువారు కూడా అనాదిగా ఉగ్గడిస్తున్నారు.

ఈ పుణ్యక్షేత్రానికి దగ్గరగా వాయవ్యదిశగా మరుదూరు అనే గ్రామం ఉన్నది. ఆ ఊళ్ళో సద్గుణ సంపన్నుడైన భక్తుడు రామయ్యాపిళ్ళ ఉండేవాడు.

అతడు కరణీక కులస్థుడు. ఆలమహర్షి గోత్రోద్భవుడు. ఏవురుభార్యల్ని పెళ్ళాడాడు. అయినప్పటికి గార్హస్థ్యధర్మాన్ని చక్కగా నిర్వర్తిస్తూ, మూర్తీభవించిన సౌజన్యమితడన్నట్లు గౌరవంగా ఉండేవాడు. ఆరవసారి కూడా పెళ్ళాడి చిన్నమ్మను భార్యగా తెచ్చుకున్నాడు. చిన్నమ్మ పుట్టిల్లు, చెన్నపట్నానికి సమీపంలో పొన్నేరి గ్రామాని కావంత దూరంలో ఉన్న చిన్నకావణం పల్లె.

రామయ్యపిళ్ళ మరుదూరు, పరిసర ప్రాంతాలలోని పిల్లలకు పాఠాలుచెబుతూ, వంశపారంపర్య ఉద్యోగం, గ్రామకరణీకం చేసుకుంటూ జీవితయాత్రను సాగిస్తున్నాడు. చిదంబరనాథుడైన నటరాజస్వామిని నిరంతరం కొలుస్తూ నిరాడంబరంగా, అందరి మన్ననలను పొందుతూ ప్రశాంతంగా జీవిస్తున్నాడు. ఆరు పెళ్ళిళ్ళయినా ఇంతవరకు నిస్సంతుగానే ఉండటం ఆతనికి, ఆతని కుటుంబంలోని వారికందరికీ పెద్ద కొరతగా ఉండేది. జ్ఞానాకాశక్షేత్రాధిపతి పరమేశ్వరుడు అనుగ్రహించిన ఫలితంగా చిన్నమ్మ కడుపుపండింది. వరుసగా ఇరువురు కుమారులను, ఇరువురు కుమార్తెలను కన్న దా తల్లి. వీరు సభాపతి పిళ్ళ, పరశురామ పిళ్ళ, సుందరాంబ, ఉణ్ణామలై అమ్మలు. చాలా ఏళ్ళుగా బిడ్డలు లేక వెలవెలబోయాక రామయ్య గృహసీమ ఇప్పుడు బిడ్డలతో కళకళలాడుతూ ఉన్నది. బిడ్డలు గారాబముతో పెరుగుచున్నారు.

ఒకానొకరోజు రామయ్యపిళ్ళ మధ్యాహ్నభోజనం ముగించి విశ్రాంతి తీసుకొనేవేళలో విభూతి, రుద్రాక్షలు ధరించిన శివయోగి ఒకరు ఆకలితో ఇంటిగుమ్మం ముందు నుంచున్నాడు. ఆకొన్న అతిథి, పైగా యోగిపుంగవుని లాగున్నాడు. ఆయనను లోనికి పిలిచి, అన్నముపెట్టి ఆదరించారు రామయ్యదంపతులు. ఆకలి బాధతో వచ్చిన ఆ శివయోగిని, విసుక్కోకుండా అతిథి మర్యాదలు చేసినందుకు ఆ ఇంటి ఇల్లాలిని ఆశీర్వదించి "తల్లీ! ఈ భస్మాన్ని ప్రసాదంగా స్వీకరించు. సమరసశుద్ధ సన్మార్గబోధకచక్రవర్తిగా గొప్ప దశకు చేరుకొనే మహాయోగ జాతకుడైన కొడుకు నీ కడుపున పుడతాడని చెప్పి అదృశ్యమైనాడు. ఈ ఉదంతం విన్న రామయ్యపిళ్ళ ఆనందాశ్చర్యాలలో మునిగి, చిదంబరనటరాజస్వామి లీల లిట్లా ఉంటాయని ఎంతో



మురిసిపోయాడు. యోగిపుంగవుని వాక్సిద్ధిప్రకారం చిన్నాంబ గర్భవతి అయింది. క్రీ.శ 1823 వ సంవత్సరం, అక్టోబరు మాసం 5వ తేదీనాడు కుమారుణ్ణి ప్రసవించింది. రామయ్యపిళ్ళ శివయోగి అనుగ్రహవాక్యాలను, దీవెనలను గుర్తుకుతెచ్చుకొని ఆనందపరవశుడైనాడు. మూడవ కుమారుడైన ఆ శిశువునకు రామలింగమన్న పేరుపెట్టినారు.

రామలింగానికి ఐదునెలలు నిండినప్పుడు, రామయ్యపిళ్ళ సతీసమేతంగా బిడ్డలను తీసుకొని చిదంబరం వెళ్ళి నటరాజస్వామిని కొలిచి మ్రొక్కులు చెల్లించడానికి బయలుదేరాడు. స్వామికి, అమ్మవారికి హారతి నైవేద్యం జరుగుతున్నప్పుడు రామయ్యపిళ్ళ తన కుటుంబంతో మూలవిరాట్టు ఎదుట నిలబడ్డాడు. రామయ్యసతీమణి చేతిబిడ్డ రామలింగాన్ని ఎత్తుకొని భక్తితో స్వామికి, అమ్మవారికి మ్రొక్కుతున్నది. పూజారి కర్పూరహారతి నిస్తున్నాడు. కర్పూరం జ్యోతిరూపంలో వెలుగుతూ ఉన్నది. అప్పుడు ఐదునెలల బాలుడు రామలింగం కనురెప్పలార్పకుండా జ్యోతిని తదేకదీక్షతో చూస్తూ పకపకనవ్వడం జరిగింది . ఐదునెలల బాలుడు అట్లా నవ్వడం జూచి పూజారి, దీక్షితులు, తల్లిదండ్రులు, మ్రొక్కడానికి వచ్చిన భక్తులు అందరూ అవాక్కయ్యారు. కొంత తేరుకొన్న తర్వాత దీక్షితులు రామలింగం బుగ్గలను చిదిమి రామయ్యనుద్దేశించి అన్నాడు. "అయ్యా, ఈ బిడ్డడు నీ బిడ్డడుకాడు, దివ్యశిశువు. సాక్షాత్తు కనకసభాపతి అంశయే" అని పొగడ్తలతో ముంచెత్తాడు. అప్పు డా దీక్షితునికి ప్రణతులర్పించి, రామయ్యపిళ్ళ రామలింగం చేసిన అనూహ్యమైన చేష్టను గురించి ఆలోచిస్తూ, ఆనందిస్తూ ఆలుబిడ్డలతో ఇంటికి చేరాడు. ఈ అద్భుతసంఘటనను గురించి విన్నవారు సరాసరి రామయ్యదంపతులను పలకరించి, చిరంజీవి రామలింగంను దర్శించుకొనేవారు.

తరువాత కొద్ది రోజులకే రామయ్య పరమపదించడం జరిగింది. ఇంటి యజమాని రామయ్య గతించడంతో కుటుంబభారాన్ని మోయలేని చిన్నాంబ, బిడ్డలతో తల్లిగారింటికి, పొన్నేరికి తరలించి, పెద్ద కొడుకు సభాపతిపిళ్ళ కష్టపడి చదువుకొని, సమీపంలోనే ఉన్న చెన్నపట్నంలో ఉపాధ్యాయవృత్తి చేసి

కుటుంబపోషణభారాన్ని తన భుజస్కంధాలపైకి తీసుకొన్నాడు. బడిపంతులు జీతంతోనే జరగని కుటుంబ నిర్వహణకు కొంత ఆర్థికలబ్ధి కోసమని పురాణ ప్రవచనాలు ప్రారంభించాడు సభాపతి.

రామలింగానికి అక్షరాభ్యాసం అయ్యింది. ఉపాధ్యాయవృత్తిలో ఉన్న అన్నగారే తొలిగురువు. తర్వాత తనని విద్యావంతుణ్ణి చేసిన మహావిద్వాంసుడు కాంచీపురం సభాపతి ముదలియార్ వద్ద రామలింగాన్ని చేర్పించారు. అన్నమీద భయభక్తులతో రామలింగం వినయాన్ని ప్రదర్శిస్తూ చదువు సాగిస్తున్నట్లనిపింపజేశాడు కానీ నిజానికి ఆతని మనస్సులో భగవదారాధనకే పెద్దపీట. భగవంతుని గురించి నిరంతరం ఆలోచిస్తూ, ఆశువుగా, అలవోకగా పద్యాలు, పాటలు అల్లుకుంటూ ఉన్నాడు. ప్రతిదినం సంధ్యాసమయంలో మదరాసు మహానగరంలో నడిబొడ్డున వెలసిన కందస్వామి మందిరానికి వెళ్ళి ధ్యానంలో కూర్చొంటాడు. రామలింగం భక్తిపారవశ్యంలో స్తుతిగీతాలు పాడుతుంటే, భక్తులు తన్మయత్వంతో ఆతనిచుట్టూ గుమిగూడేవారు.

క్రమక్రమంగా రామలింగంలోని ప్రతిభ ప్రకాశవంతమయ్యేసరికి గురువు సభాపతిపిళ్ళ కసూయ కలిగి, రామలింగానికి విద్యనేర్పడం చాలించాడు. గురువు ఆగ్రహానికి గురియై, చదువుసంధ్యలు మాని తమ్ముడు అప్రయోజకుడైపోతున్నందుకు అన్నకూడా ఆగ్రహించాడు. అసంతృప్తితో బాధపడ్డాడు, తనలోతాను కుమిలిపోయాడు. నయాన, భయాన హెచ్చరించాడు. రామలింగాన్ని నిలదీసినప్పుడు ఏమీ మాట్లాడక మౌనాన్నే సమాధానంగా తీసుకొనేవాడు. రామలింగంలోని మంచితనాన్ని సహించే ఓర్పు నశించింది. సభాపతితో తమ్ముణ్ణి ఇంటినుండి గెంటించాడు. సభాపతిభార్య, భర్త ఇంటలేనప్పుడు, మరది రామలింగాన్ని చేరదీసి అన్నపానీయాలు అందించి ఆదరించేది.

తండ్రిశ్రాద్ధమునాడు సభాపతి తన తమ్మునితో కలసి శ్రాద్ధం జరిపించనందుకు చింతించాడు. శ్రాద్ధంరోజు పంచభక్ష్యపరమాన్నాలను బంధువర్గానికి వడ్డించి, తాను ఆరగించి తమ్ముని దూరంచేసుకున్నందుకు



చెప్పలేనంత బాధతో కాలం వెళ్ళబుచ్చాడు. ఆయనభార్య, మరది రాక కోసం వేచి, సాయంత్రంవేళ పెరటిమార్గంగా యింటిలోనికి అడుగుపెట్టిన రామలింగాన్ని చూచి, కన్నీరుమున్నీరై చల్లారిన భోజనసామగ్రిని వడ్డించింది. అతని మనసును మార్చాలని కంట తడిపెట్టి, “అయ్యా, నీకేం గ్రహచారం– మీ అన్న నిన్ను గురించి ఎంత వేదనకు గురి అవుతున్నారో నీకు తెలుసా? బాబూ ఆయన మనసు ఇంక నొప్పించవద్దు. ఇంటికి చేరుకో! చక్కగ చదువుకో! నీకేం కొరత ఇక్కడ? వచ్చేయ్ బాబూ! అన్నమాట విని బుద్ధిగా చదువుకోవయ్యా” అని, వేడుకొన్నది. “వదినా! నీవు నాకు తల్లివి–నీవు చెప్పినట్లే నడచుకుంటాను. మనింటి మిద్దెమీద ఉన్నగదిని నాకు కేటాయించేటట్లు అన్నతో చెప్పండి. ఆ గదిలోనే ఉండి నేను నా చదువులు సాగిస్తాను” అని రామలింగం వదినగారిని వేడుకున్నాడు. మళ్ళీ కనబడతాననిచెబుతూ, వెళ్ళిపోయాడు.

రామలింగం కోరినట్లు మిద్దెమీదగదిలో తన మకాం ఏర్పాటయ్యింది. బుద్ధిగా ఇక చదువుకుంటాడు కుర్రాడు అని అందరూ అనుకున్నారు. కానీ జరుగుతున్నదది కాదు. గదితలుపులు మూసుకొని పుస్తకాలు చదువుకుంటున్నాడని అన్న, వదినె, మిగతావారు అనుకుంటూ ఉన్నప్పుడు రామలింగం ఒక అద్దాన్ని ముందుంచుకొని అందులో కన్నులార్పకుండా తన ప్రతిబింబాన్ని చూచుకుంటూ సుబ్రహ్మణ్యస్వామి ఉపాసనలో తన్మయుడయ్యేవాడు. తన ప్రతిబింబంలో క్రమంగా సుబ్రహ్మణ్యస్వామి రూపం సాక్షాత్కరించడం జరిగింది. అప్పుడు రామలింగం వయస్సు తొమ్మిదేళ్ళు. అదిమొదలు రామలింగంలో ఒక పూర్వమైన తేజస్సు నిండుకొన్నది. స్కందుని కృపాకటాక్షంవల్ల ఆధ్యాత్మికవిద్యలో అఖండప్రావీణ్యాన్ని సొంతం చేసుకొన్నాడు రామలింగం.

అన్న సభాపతిపిళ్ళ చెన్నపట్టణంలో ఒక శ్రీమంతుని ఇంట ప్రతి శనివారం సత్సంగంలో పురాణప్రవచనం చేసి, కుటుంబ ఖర్చుల కోసం కొంత సంపాదించుకొనేవాడు. ఆ శ్రీమంతుని ఇంటిలో ఒక శనివారం నటరాజస్వామి బంగారువిగ్రహాన్ని ప్రతిష్ఠించి, జ్ఞానసంబంధులవారి జీవితచరిత్రమీద ప్రసంగ

కార్యక్రమం ప్రకటన జరిగింది. ఆ రోజు సభాపతిపిళ్ళ అనారోగ్య కారణంగా పురాణప్రవచనానికి పోవడం వీలుకాక, తనకుబదులుగా తమ్ముని ఆ సత్కార్యానికి పురమాయించాడు. వెళ్ళేందుకు తటపటాయిస్తున్న తమ్ముని దగ్గరకు పిలిచి "రామలింగం! భయపడకు నీకు తెలిసిన ఒకటో రెండో పద్యాలు, పాటలు పాడి ఈ వారం ప్రవచనం అయ్యిందనిపించు చాలు" అని భరోసాయిచ్చి పట్నానికి పంపించాడు అన్న సభాపతిపిళ్ళ. రామలింగం ప్రవచన శైలి భక్తులను మురిపించింది. ఆయన మధురకంఠంతో పాటలు, పద్యాలు చెబుతూ రసవత్తరంగా ఉపన్యసించి, భక్తజనుల హృదయాలు దోచుకున్నాడు. గంటన్నర కాలంలో ముగించవలసిన పురాణ ప్రవచన కార్యక్రమం మూడు గంటలకు మించి సాగుతున్నా ఉప్పొంగిపోయే హృదయాలతో సభికులు మైమరచి వింటున్నారు. అంతసారస్యంగా, మధురమనోహరంగా, రామలింగం ఉపన్యసించారు. ఆ సభ జరిగిన మరుసటిరోజు ఆ శ్రీమంతుడు ఆతనితో ముఖ్యులైన మరికొందరు సభ్యులు సభాపతిపిళ్ళ ఇంటకువచ్చి ఆరోగ్యవిషయం ప్రస్తావించి, క్రిందటి సత్సంగంలో తమ్ముడు రామలింగం అద్భుతంగా చేసిన పురాణప్రసంగాన్ని గురించి ప్రశంసించారు. మరికొన్ని వారాలు కూడా తమ్ముని చేతనే ప్రసంగాలు ఏర్పాటు చేసి, విని తరించే భాగ్యాన్ని ప్రసాదించండి అని వారు సభాపతిపిళ్ళను కోరారు. అందుల కంగీకరించాడు సభాపతిపిళ్ళ.

సభాపతి కీ పరిణామాల కథా కమామిషు అర్థంకాలేదు. "ఏమీ వింత? చదువు సంధ్యలు లేక జులాయిగా తిరుగుతూ ఉండి ఇప్పుడిప్పుడే బాధ్యతలను తెలిసికొని దారికివస్తూ ఉన్న రామలింగం యుక్తాయుక్తవిచక్షణ కలిగి అనుభవజ్ఞులైన సత్సంగం సభ్యులు మెచ్చేరీతిగా, అంతగొప్పగా పురాణ ప్రవచనం చేశాడంటే నమ్మలేకున్నాను" అని సందేహంతో సతమతమయ్యాడు. దీని ఆంతర్యాన్ని స్వయంగా తెలుసుకోదలచి ఒక శనివారం తమ్ముని ప్రసంగానికి హాజరై పరోక్షంగా ఉండి విన్నాడు, కన్నాడు. తమ్ముని పురాణప్రవచన, వ్యాఖ్యాన, వైఖరికి, ముగ్ధుడయ్యాడు. గంగాఝురిలాంటి వచో విలాసానికి, అద్భుతమైన



వివరణలతీరునకు పులకాంకితుడైనాడు. "ఇది కలా, నిజమా" అని విభ్రాంతికి గురియైనాడు.

"ప్రసంగిస్తున్నది నిజంగా రామలింగమా, వేరెవరోనా?" అని ప్రశ్నించుకొన్నాడు. "ప్రసంగం చేస్తున్నది నా తమ్ముడా కాదు సాక్షాత్తు సుబ్రహ్మణ్య భగవానుడే" అని భావించాడు సభాపతి.

ఇంటికి వెళ్ళి భార్యతో తమ్ముడు చదువుమీద శ్రద్ధలేని మూర్ఖుడనుకున్నాము, కాదు. అతడు సాక్షాత్తు కుమారస్వామియే. ఇందులో సందేహించవలసిన పనిలేదని చెప్పి, తా నేవిధంగా ఆ భగవత్స్వరూపుణ్ణి హింసించాడో తలచుకొని, చెప్పలేనంత బాధాతప్తహృదయుడైనాడు. తన అజ్ఞానానికి తలవంచుకొన్నాడు.

మదరాసుకు దరిదాపుల్లో తిరువత్తియూరున్నది. పట్టణత్తార్ అనే సిద్ధుడు సమాధి పొందిన పుణ్యక్షేత్రమది. ఆ ఊళ్ళో త్యాగేశస్వామి దేవాలయమున్నది. దక్షిణదేశంలో ప్రముఖ శివక్షేత్రాలలో నిది ఒకటి. రామలింగస్వామి ప్రతిదినము తిరువత్తియూరు త్యాగేశ్వరుని దర్శనం చేసుకొని, ఆశువుగా పద్యసుమాలతో స్వామిని పూజించి, అక్కడచేరిన భక్తులను ఆశ్చర్యచకితులను చేస్తూ ఉండేవాడు.

రామలింగస్వామి ఆహార్యం విలక్షణంగా ఉన్నది. "తెల్లని వస్త్రాన్ని మోకాళ్ళ మీదుగా ధరించి జ్ఞానజ్యోతివలె ప్రకాశించు శరీరము ఇతరులకు కనబడని విధమున వస్త్రముచే కప్పుకొందురు". తలపై అదే వస్త్రంతో ముసుగు ఏర్పరచుకొంటారు. అనవసరంగా మాట్లాడటం, ప్రగల్భాలు పలకడం, అహంభావం ఏకోశాన కనబడనీయక ప్రవర్తిల్లడం, నడచేటప్పుడు ప్రక్కలకొదిగి వినయంతో సాగిపోవడం రామలింగస్వామి నైజగుణాలు.

బాల్యంలోనే అద్భుతమైన భక్తిగీతాలను, ఆధ్యాత్మిక సాహిత్యాన్ని అలవోకగా పాడి పుస్తకరూపంలో భక్తులకు ప్రసాదించిన ప్రసన్నకవి రామలింగం. ఆ రచనలో నిర్దుష్టత, సరళత, చదువరులనట్టే ఆకట్టుకొనే ప్రసాదగుణం. ఆద్యంతం విస్తరిల్లింది.

ఒకసారి తొళువూరు వేలాయుధమొదలి అనే ఒక గర్వి, కవి, కఠినపదాలతో, శ్లేషనుగుప్పించి. ఆ రచన ప్రాచీనసంఘ కవిపుంగవులలో ఒకరు వ్రాసినదని, చూడుమని రామలింగస్వామిని కోరాడు. ఆ రచనలో మొదటి పుటలోని పద్యాలను చూచి, దానిలోని దోషాలను, అసంబద్ధతను, అస్తవ్యస్తతను గ్రహించి, అవి ప్రాచీన కవి రాసినవి కావని, నిర్ణయించుకొని, “అయ్యా! ఈ కృతి సంగకవులదికాదు. చూడండి ఎన్నితప్పులున్నాయో. ఇది ముమ్మాటికి భాషాలక్షణాలు, ఛందోనియమాలు తెలియని వారెవరో వ్రాసినదై ఉంటుంది.” అని చెప్పేసరికి, మొదలి తన తప్పును తెలుసుకొని క్షమించుమని స్వామి పాదాలను పట్టుకొన్నాడు; శిష్యుడైనాడు–స్వామి అనుగ్రహానికి పాత్రుడైనాడు. ఆ కాలంలో ప్రముఖులైన పండితులు, కవులు, భక్తాగ్రేసరులెందరో స్వామి సన్నిధి చేరి జ్ఞానోపదేశాన్ని పొందారు. ఆ విధంగా రామలింగస్వామి పేరుప్రఖ్యాతులు తమిళదేశం నలుమూలలకు ప్రాకింది.

కాంచీపురం సభాపతి మొదలియార్‌ను గురించి మనమిదివరకే విన్నాము. ఆయన సభాపతిపిళ్ళకు గురువు. స్వాములవారిని గురించి స్వాములవారి దివ్యత్వాన్ని గురించి అతనికి బాగా తెలుసు. అతడు సవినయంగా స్వాములవారి వద్దకువచ్చి బాలురకుపయోగపడే రీతిలో మనువనే ఒకరాజుగారి చరిత్రను సులభశైలిలో రాయుమని కోరగా, ఆ కోరికనుమన్నించి, బాలురకేకాదు. పండితులకు, పెద్దలకు కూడా ఉపయుక్తమయ్యేటట్లు మనుమురై ‘కండవాచకం అనే కృతిని, జీవకారుణ్యభావ ప్రశస్తిని చాటే కావ్యం. అది వ్రాసినవారు స్వామి.

ఒకరోజు రామలింగస్వామి తిరువత్తియూరులో త్యాగేశుని కొలిచి ఇంటికి చేరడానికి బయలుదేరేసరికి రాత్రి అయ్యింది. అందువల్ల అక్కడ ఒక సత్రంలో పడుకొన్నాడు. చెవిలో బంగారుపోగులు ధరించియున్నారు. ఒక దొంగ చూచాడు. ఎడమవైపు మేను వాల్చి పడుకొని ఉన్నందున, దొంగ మెల్లగా స్వామిని సమీపించి, కుడి చెవిలోని పోగును దోచుకొన్నప్పుడు, స్వామివారు ఎడమ చెవిలోని పోగును కూడా దొంగ చేతికివ్వదలచి, నెమ్మదిగా కుడివైపునకు



తిరిగి పడుకున్నారు. బాగా నిద్రపోతున్నట్టు నటించారు. దొంగ ఎడమచెవిపోగును కూడా తస్కరించి తీసుకొని వెళ్ళాడు.

మరొకనాడు దైవదర్శనం తరువాత వాహనమంటపంలో ధ్యానంలో కూర్చొన్నస్వామి, ఆహారం తీసుకోవడం మరచిపోయి అక్కడే ఉండిపోయాడు. ఇది గమనించని పూజారులు గుడి తలుపులు మూసుకొనివెళ్ళారు. తరువాత చాలసేపటికి ధ్యానం నుంచి లేచిన స్వామికి ఆకలిగా ఉన్నది. అప్పుడు ఆ అర్ధరాత్రివేళ ఎవరో పూజారి ఒకడు దేవుని ప్రసాదం తీసుకోండి అని చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు.

రామలింగస్వామి శివభక్తులు. అందరూ అనుకొనేవారు ఆయనకు శైవమత విషయాలు తప్ప మరేమీతెలియదని. ఒకసారి కొందరు వైష్ణవులు స్వామివద్దకు వచ్చి, మా మతసంబంధమైన విశేషాలేవైనా చెప్పండి అని కోరినారు. అప్పుడు స్వామి వైష్ణవమత గ్రంథములలోని అనేక విషయాలను ఆసక్తికరంగా చెప్పి ఆ వచ్చిన వైష్ణవులను ఎంతో సంతోషింపజేశారు. అప్పటినుండి స్వామికి శైవమతరహస్యాలే కాదు, సర్వమత విషయాలు కరతలామలకమని, అందరూ స్వామిని మరింత పూజింపసాగారు.

స్వాములవారికి ధనాపేక్ష లేదు. శ్రీమంతులవద్దకు వెళ్ళడం, వారి కటాక్షంకోసం వేచియుండటం, వారిని పొగడ్తలతో ముంచెత్తడం, వీరెప్పుడు చేయలేదు. వీరి పురాణప్రవచనాలు విని సంతోషించిన ధనవంతులెపుడైనా డబ్బులు కానుకగా ఇస్తే, ఆ డబ్బును వెలుపలికి వచ్చి ఇళ్ళమీద, వీధులవెంబడి చల్లేవారు. ఇది తెలిసికొని, ఇవ్వదలచినవారు ధనాన్ని స్వామి అన్నగారైన సభాపతిపిళ్ళ కందజేసి తృప్తిజెందేవారు.

స్వామి ఎవరినీ యాచించలేదు. ఒకసారి ఒక నిరుపేద స్వామిని ఆశ్రయించి, “నా బాధలు తొలగించడానికి మీ చెంతకువచ్చే ధనవంతునొకనికి సిఫారస్ చేసి నన్ను ఆదుకోమనండి” అన్నాడు. అప్పుడు స్వామి ధనంకోసం ఇతరులను యాచించడం నీచమైనపని, నేనా పనిని చేయనని అతనికి బోధించి పంపించారు.

తల్లి, అన్న, వదిన, తదితరబంధువులు, ఇంటికి విచ్చేసిన కొందరు సాధువులు అందరూ ఒక్కత్రాటిపై ఉండి సంసారజీవితమందు ఎంత విముఖత జూపినప్పటికీ, పట్టుబట్టి రామలింగస్వామికి, అక్కగారైన ఉణ్ణామలమ్మ కుమార్తె ధనకోటమ్మతో పెండ్లి చేశారు. ఆధ్యాత్మిక జ్ఞానానందంలో మునిగితేలే రామలింగస్వామికి వివాహబంధం బొత్తిగా నచ్చలేదు. భార్యతో ఉన్నప్పుడు ప్రతిరాత్రి రామలింగస్వామి తిరువాచకమనే శైవమతగ్రంథాన్ని చదవడమేగాని, ధనకోటమ్మనుగురించిన ఆలోచనే లేదు. జగత్కల్యాణం కోసం అవతరించిన దివ్యపురుషుల ధోరణులే వేరు.

తిరువత్తియూరు పట్టినత్తార్ దేవాలయం సమీపంలో చిరకాలం సేవలందిస్తూవచ్చిన ఒక వృద్ధ వనిత ఒకనాడు స్వామి చెంతచేరి " నా కొక దిక్కుజూపు, నన్ను దీవించు మహాప్రభూ" అని ప్రార్థించింది. అప్పుడు స్వామివారు నవ్వుతూ ఒక పిడికెడుమట్టి తీసి ఆమెచేతిలోపెట్టి, "నీకిదే దిక్కు" అని చెప్పారు. కాసేపటిలో ఆ మట్టి శివలింగమై కనబడటంతో ఆ వనిత ఆనందాశ్చర్యాలతో ఉబ్బితబ్బిబ్బయి అక్కడ చేరిన భక్తజనులతో స్వామి మాహాత్మ్యాన్ని గురించి పదేపదే ముచ్చటించింది.

తిరువత్తియూరులో దిగంబరుడై ఒక సాధువు కొన్ని రోజులుగా, ఒక వీధిలో అరుగుపై ఉంటూ పిచ్చిపిచ్చిగా మాట్లాడుకుంటూ కాలం వెళ్ళ బుచ్చేవాడు. తనదృష్టిలో పడినవారిని, చూస్తూ "అదిగో గొడ్డు పోతూ ఉన్నది. ఇదిగో కుక్క పోతూ ఉన్నది. అల్లదిగో బఱ్ఱె అదో గొఱ్ఱె" అని వినేవారి కవి ఎకసెక్కపు మాటలు ప్రేలాపనలు అనిపించేవిధంగా ప్రవర్తించేవాడు. ఒకనాడు ఆ వీధిలో రామలింగస్వామి నడుస్తూ వెళుతున్నాడు; చూచిన సాధువు "ఇదో, ఒక మంచి మనిషి పోతున్నాడు" అన్నాడు. రామలింగస్వామి ఆతని దగ్గరకు వెళ్ళి కొంత సంభాషించి, తన దారిని తాను వెళ్ళిపోయిన వెంటనే ఆ సాధువు ఆ వీధి, ఆ ఊరు వదలి ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఆ దిగంబర సన్యాసి పలికిన పలుకులలో ఎంతో గంభీరమైన భావనలున్నట్లు ఆ పిదప అందరూ



అనుకొనేవారు. మనుజులను మృగజన్మలుగా, ఉత్తమ మానవమూర్తులుగా, దివ్యజనులుగా ఆయన వర్గీకరించేవాడేమో!

ఒక దినము స్వామి, మదరాసులో వ్యాసర్‌పాడి అనే ప్రాంతంలో ఉపన్యాసం ముగించి భక్తమిత్రులతో కలిసి, తిరిగి వచ్చేటప్పుడు మార్గంలో ఒకపెద్ద పాము ఎదురుగా ప్రాకుతూ వస్తున్నప్పుడు మిత్రులు భయపడి ఇటు అటు పరుగెత్తు తున్నప్పుడు స్వామి నిశ్చలంగా నిలబడి, పాముపైనే దృష్టిసారించారు. ఆ పాము మెల్లగా స్వామి పాదాలు చుట్టుకొన్నది. కాసేపు అట్లే ఉండనిచ్చి, స్వామి "ఇకచాలు పో" అనగానే, ఆ పాము సరసరా ఆ చోటు వీడి పక్కదారిన బడి వెళ్ళిపోయింది.

ఒక సందర్భంలో ఒక ధనవంతుడు తన ఇంట్లో జరిగే పెళ్ళికి అందరికీ ఆహ్వానాలు పంపి, అట్టహాసమైన ఏర్పాట్లుచేశాడు. స్వామికి కూడా ఆహ్వానమందింది. ఆహ్వానితులు వారివారి హోదాలకు తగ్గట్టు వస్త్రధారణ, వాహనాలు ఏర్పాటు చేసుకొని పెళ్ళిమండపానికి చేరుకుంటున్నారు. రామలింగస్వామి కూడా బయలుదేరాడు. తీరా పెళ్ళిమండపాన్ని చేరుకున్నాడు. అక్కడ చేరినవారి ఆడంబరాలు, ఆహార్యాలు, కోలాహలం చూచి, తాను ఆ వాతావరణంలో ఇమడ వీలు కాదని, మంటపానికి ఆవల ఒక తిన్నెమీద తిష్ఠవేశాడు. పెళ్ళి వేడుకలలో మునిగిన వారెవరూ దీన్ని పట్టించుకోలేదు. అంతలో ఎవరో స్వామి పెళ్ళిమండపంలోకి ప్రవేశించకుండా దూరంగా కుర్చోవడాన్ని చూచి పెళ్ళిపెద్ద అయిన శ్రీమంతుని దృష్టికి తీసుకొనివెళ్ళారు. పెళ్ళిపెద్ద స్వామి లోనికి రాకుండుటకు కారణమేమని కబురుచేద్దామనేలోపుగా, ఒక పిల్లవాడు స్వామి రాసియిచ్చిన చీటీ నొకదానిని ఆతనికిచ్చాడు. అందులో స్వామిరాశాడు.

**"జోడు లేదు, తెల్లచొక్కాయ లేదు, మేల్**
**పంచె లేదు, పనియుఁబాటు లేదు**
**ధనము లేదు, దేహదార్ఢ్యంబు లే దిల్లు**
**లేదు పెండ్లి కెట్లు పోదు మనస"** – అని

దీన్ని చదివి ఆ శ్రీమంతుడు, "ఇక మీదట ఆడంబరాలజోలికి పోనని తీర్మానించుకొని, స్వామి దీవెనలనందుకొని సన్మార్గవంతుడైనాడు.

మరొకరోజు స్వామి తిరువత్తియూర్ స్వామి దర్శనంచేసుకొని ఆలస్యంగా అక్కగారి యింటికి చేరారు. అప్పుడు అక్కగారు మిగతావారు భోజనాలు ముగించి, రామలింగస్వామి కోసం చాలసేపు వేచియుండి, ఇక వచ్చిన తరువాత తలుపులు తెరవవచ్చునని, తలుపు గడియవేసి పడుకున్నారు. ఆలస్యంగా వచ్చిన స్వామి, పడుకొని నిదురపోతున్నవారిని లేపి వారికి నిద్రాభంగం కలగించడానికి ఇష్టపడక, ఆకలి ఉన్నప్పటికీ, అరుగుమీద ఒరిగి కన్నుమూశారు. బిడ్డడైన రామలింగం ఆకలిబాధను బాప, సాక్షాత్తు జగన్మాత అన్నపూర్ణ, అక్కగారి రూపంలో, అరటి ఆకులో అన్నంవడ్డించి, స్వామి ముందర విస్తరివేసింది. నా రాక తెలుసుకొని అక్క ఎంత ఆదరంతో అన్నం, అరుగుమీదికే తెచ్చిందని, ఆరగించి, మళ్ళీపడుకొన్నారు స్వామి. తమ్ముడింత రాత్రయినా రాలేదేమా అని అక్క తలుపు తెరచి నిదరబోతున్న తమ్ముని "రామలింగం" అని లేపి, "లోనికి రా, అన్నం తిందువుగాని, ఇంటికి రావడం ఇంత ఆలస్యంగానా చూడు అర్ధ–రాత్రిదాటింది" అని గోముగా స్వామిని లోనికి రమ్మని పిలిచింది. రామలింగానికి ఆశ్చర్యం! ఇంతకుమునుపే గదా అక్క నాకు అరటి ఆకులో అన్నం వడ్డించిం దీ అరుగుమీదనే కదా! మళ్ళీ ఎందుకు లోనికి రమ్మంటుందీ అని తనలో తాను ప్రశ్నించుకుంటూ "అక్కా, ఇంతకుమునుపే గదా నీవు అరటి ఆకులో అన్నం తెచ్చి నాకు ఈ అరుగుమీదనే పెట్టావు. నేను తిన్నాను. తినిపారవేసిన అరటిఆకు అదిగో అక్కడే ఉన్నది చూడు. అంతమరుపైతే ఏలాగమ్మా" అనేసరికి అక్కకు స్ఫురించింది; దైవస్వరూపమైన రామలింగస్వామికి అమ్మ అన్నపూర్ణాదేవి అన్నప్రసాదం స్వయంగా వడ్డించిందని తన తమ్ముడెంత అదృష్టవంతుడోనని ఉప్పొంగిపోయిందావిడ.

ఇట్టి అద్భుతము లెన్నో సంభవించినవి స్వామి జీవితకాలంలో. మదరాసులో స్వామి అడుగుపెట్టని గుడిలేదు. తానడుగిడిన చోటల్లా జీర్ణావస్థలో ఉన్న దేవాలయాలు, పూజాపునస్కారాలు కొరవడిన కోవెల లన్నీ జీర్ణోద్ధరణ, 



పునరుద్ధరణలు నోచుకొన్నాయి. ఆదిశంకరులవారు దర్శించినక్షేత్రాలను, క్షేత్రపతులను, అమ్మవార్లను గురించి స్తుతులు వెలయించినట్లు రామలింగస్వామికూడా చాల సందర్భాలలో తాను అడుగుపెట్టిన ఆలయమూర్తుల మీద అలవోకగా, నిండిన భక్తితో పాటలు, పద్యాలు, స్తుతులు కూర్చియున్నారు.

ఇంతలో స్వామివారికి మాతృవియోగం. అదే సమయంలో చిన్నఅన్న పరశురామపిళ్ళ అనారోగ్యానికి గురికావడం జరిగింది. దేహారోగ్యం క్షీణిస్తూ ఉన్నది. శక్తులుడుగకముందే ఒకసారి చిదంబరంలోని నటరాజస్వామిని దర్శించాలన్న కోరికను వెలిబుచ్చాడు పరశురామపిళ్ళ. అప్పుడు అన్న అభీష్టాన్ని తీర్చడానికి రామలింగస్వామి అన్నను పిలుచుకొని చిదంబరం ప్రయాణమైనారు. మార్గమధ్యంలో అనేక మందిరాలను దర్శిస్తూ కొద్దిరోజులు పుదుచ్చేరిలో మకాం చేశారు. స్వాముల వారితో, ఆత్మీయులైన శిష్యులు కూడా కొందరు ఈ తీర్థయాత్రలకు బయలుదేరారు. పుదుచ్చేరిలో ఉన్నన్నాళ్ళు సందర్శకుల సందేహాలు తీర్చడం, వేదాంతశాస్త్రరహస్యాలను వారికి వివరించడంవల్ల స్వామి పేరు పుదుచ్చేరి నలుదిశల వ్యాపించింది. ఆ తరువాత స్వామి, అన్న, మిత్రబృందము అందరూ చిదంబరం చేరుకున్నారు. తొలుత నటరాజస్వామిని, తదుపరి పరిసర ప్రాంతాలలోని దేవతామూర్తులను సందర్శించి, చక్కని భక్తిమాలికల నల్లి, తిరిగి చిదంబరం చేరుకున్నారు. అప్పుడే స్వామి ప్రారంభించిన బృహద్రచన "అరుట్పా" (అనుగ్రహగీతాంజలి) లో నాలుగో అధ్యాయాన్ని పూర్తిచేశారు.

స్వామి చిదంబరంలో ఉంటున్నప్పుడు, అక్కడే ఉంటున్న ప్రసిద్ధికెక్కిన కోడన నల్లూరు సుందరస్వామి అనే ఒక సిద్ధ పురుషుణ్ణి దర్శించాలనుకొని, శిష్యులను పురమాయించి, సుందరస్వామితో భేటీకి ఒక సందర్భాన్ని ఏర్పాటుచేయుమని కోరారు. గురువాజ్ఞను శిరసావహించి శిష్యులు సుందరస్వామి కీ వార్త తెలిసినప్పుడు, సుందరస్వామి. ఏమిటేమిటి? శ్రీవారు నావద్దకు రావడమా? ఎంత అపచారం. నేనే వారి సన్నిధికి వచ్చి దర్శనం

చేసుకుంటాన”ని హుటాహుటిని శిష్యులతో, స్వామి శిష్యులు వెంటరాగా రామలింగస్వామి బసచేసిన ప్రాంగణం చేరుకుని, సముచిత మర్యాదలతో స్వామిచెంత కూర్చున్నారు. ఇద్దరు మహాపురుషులు కూర్చుని మూడురోజులు అనేక ఆధ్యాత్మికవిషయాలు ముచ్చటించుకొన్నారు. సుందరస్వామికి, రామలింగస్వామిమీద ఎనలేని గౌరవం. అట్లాగే రామలింగస్వామి సుందరస్వామిని ప్రేమాదరాలతో ముంచెత్తినారు. వారి సమాగమం ముగిసిన తదుపరి సుందరస్వామి, రామలింగస్వామినుండి సెలవుతీసుకొని వెళ్ళిపోయిన దరిమిలా రామలింగస్వామి కన్నులనుండి దుఃఖాశ్రువులు రాలాయి. కారణమేమని శిష్యులు మరీమరీ అడగ్గా “ఇంతటి మహానుభావుడు, సకలశాస్త్రపారంగతుడు ఇక ఆరునెలల తరువాత మనకందడు గదా” అని గద్గదకంఠంతో పలికారు. అట్లే ఆరునెలల తరువాత సుందరస్వామి పరమపదించారు. అంతటి దూరదృష్టి గలిగిన మహానుభావులు శ్రీ రామలింగస్వాములవారు.

చిదంబరంనుండి శీర్కాళి, వైదీశ్వరన్‌కోయిల్, మధురలలో దేవతలను దర్శించుకొని, వారిపై పాటలు, పద్యాలు పాడి, కరుంగుళి గ్రామం చేరుకున్నారు స్వామి. అక్కడ ఒక భక్తుడు వేంకటరెడ్డి ఆయన స్వామివారికి అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేసి స్వామి దైనందిన కార్యక్రమాలకు ఎంతో సహకారమందించాడు. ఒక రాత్రి స్వామి నీటితో దీపాన్ని వెలిగించి, గంటలకొలది వెలుగునింపిన వైనం, ఆ ఊరివారి నందరిని ఆశ్చర్యంలో ముంచినది. అప్పటినుండి స్వామివారి మహిమలు ఆ చుట్టుపట్ల బాగ విస్తరించి, భక్తులను తండోపతండాలుగా వేంకటరెడ్డి ఇంటికి బారులు తీర్చి రప్పించడం జరిగింది. షిర్డీలో సాయిబాబా నీటితో దీపాలు వెలిగించిన ఉదంతాన్ని తలపింపజేస్తుంది ఈ కరుంగుళి ఉదంతం.

ఇట్లాగ ఎన్నో స్వామివారి లీలాక్రీడలు. దివ్య పురుషులు అప్పుడప్పుడు చమత్కారాలుచేసి భక్తులలో సంస్కారం కలిగించి, వారిని పురుషోత్తమ



సాక్షాత్కారానికి సమాయత్తం చేస్తారన్నది భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ఉవాచ. కరుంగుళిలో ప్రతిరోజు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, చర్చాగోష్ఠులు జరిపేవారు.

మధురలో శ్రీ జ్ఞాన సంబంధమూర్తి మఠంలో విరాగియై చేరిన కరుంగుళి గ్రామస్థుడు పురుషోత్తమరెడ్డిని, ఆతని తల్లిదండ్రుల ప్రార్థనప్రకారం ఇంటికి పిలిపించిన ఉదంతం ఆ సందర్భంగా గర్వంతో, అహంభావంతో విర్రవీగిన పండితులను, అవధానులను స్వామి దారికి తెచ్చినవైనం కరుంగుళి పురుషోత్తమరెడ్డి మేనమామ బాలురెడ్డి కుష్ఠురోగాన్ని స్వామి ఎలా నయం చేశారో. ఇవన్నీ వింటూంటే మన ఒళ్ళు పులకరిస్తుంది. ముత్తునారాయణరెడ్డి కన్నులలో జబ్బుకారణంగా చూపు కోల్పోయినపుడు స్వామి మహిమవల్ల మళ్ళీ కళ్ళు తెచ్చుకొన్న సంఘటన ఇవన్నీ స్వామి మహిమను యావత్ తమిళ దేశమంతా ప్రాకింపజేసింది. తనకు కన్నులిచ్చినందుకు కృతజ్ఞతతో భక్తితో తనకున్న ఆస్తి సర్వస్వాన్ని స్వామి కర్పించ సంకల్పించాడు ముత్తు నారాయణరెడ్డి. అప్పుడు స్వామి “ నాకు ఆస్తులవల్ల ఏం ప్రయోజనం? ఈ ధనాన్ని ఉపయోగించి ఈ ఊళ్ళో (అంటే కరుంగుళిలో) శ్రీనివాస దేవాలయమున కైంకర్యములు చేయించండి” అన్నారు. స్వామి అభీష్టంప్రకారమే ముత్తునారాయణరెడ్డి దేవాలయ నిర్వహణకు తన ఆస్తులపై హక్కును వదలుకున్నాడు.

స్వాములవారు చెన్నపురి వదలి చాలకాలమైనది. తన వివాహ కాలమునకైనా వచ్చి, ఆశీర్వాదము లందజేసి దీవిస్తారని కలలు గన్నాడు మిత్రుడు ముత్తుస్వామి. వివాహ సమయ మాసన్నమౌతున్నది. కానీ స్వామి చెన్నపురి పయనం వాయిదా పడుతున్నది. ఈ పరిస్థితులలో స్వామి దివ్యదృష్టితో వివాహ ముహూర్తానికి పోవ వీలుపడదని తెలుసుకొని ఒక పద్యమాలికను ఉత్తరంగా వ్రాసి ముత్తుస్వామికి పంపారు శిష్యుడు శ్రీనివాసవరదాచార్యులద్వారా. అది ఒక విచిత్రమైన పెళ్ళికానుక. ఆ ఉత్తరం శీర్షిక “ కుటుంబ ఘోరం” దానిలో గొప్ప వేదాంతవిషయాలను, దైనందిన మానవజీవనమున ఎదుర్కొనే కష్టాలను ప్రతీకలుగా పేర్కొంటూ పెళ్ళికి రాలేకపోతున్నందుకు బాధపడవద్దని చెబుతూ మిత్రుని ఓదార్చడం జరిగింది. ఈ ఉత్తరం 412 పాదముల గల పద్యమాలిక.

ఈ సందేశంలో మానవజీవితాని కవసరమైన ఆధ్యాత్మికసంపద నిక్షిప్తమైనదని ముత్తుస్వామి ఆ ఉత్తరంలోని సందేశాన్ని కంఠస్థం చేసి ప్రతిదినం పారాయణ పాఠంగా చేసుకున్నాడు. ఆతని కుటుంబంలో తరం తరువాత తరంగా కంచి నాగలింగంవరకు ఆ పారాయణను వదల్లేదు.

శ్రీవారు కరుంగుళిలో 16 సంవత్సారాలు విడిది చేశారు. అనేక మహిమలను ప్రదర్శించారు, అద్భుత కార్యాలు చేశారు. స్వామి తన ఉద్యమానికి సమరస సన్మార్గమని పేరుపెట్టుకొన్నారు. కులాలకు, వర్గవిభేదాలకు అతీతంగా పరమాదరణీయము, సర్వాకాంక్షితమయిన తత్త్వమది. కరుంగుళినుండి వారు అప్పాసామిశెట్టి ఆహ్వానం అందుకొని కడలూరు చేరుకున్నారు.

కడలూరులో ఒకనాడు స్వామి శెట్టిగారి అరటితోటలో వాహ్యాళికి వెళ్ళినప్పుడు అక్కడ సర్పం కాటుకు గురియైనారు. తోడుగానున్న శిష్యులు కొందరు చికిత్స కోసం ఆరాటపడుతూ, కొందరు పామునువెదకి చంపడానికి కొందరు హడావడి పడుతున్నారు. వారిని చూచి స్వామి అన్నారు. "అయ్యలారా నాకేమీ కాదు. మీరు చికిత్స ఏర్పాటు చేయవద్దు. పామును చంపేప్రయత్నం మానండి. దానికి కాలంచెల్లి నన్ను అది కుట్టినది దాని ప్రాణాలనంతమొందించుకొనడానికే. కాబట్టి మీరు పనిబట్టి దాన్ని కొట్టకండి" అన్నారు. కాసేపటికి వారందరు అక్కడ ఉన్నప్పుడే ఆ పాము చచ్చి, చెట్టుపైనుంచి స్వామి పాదాలచెంత పడింది! ఎంత వింత సంఘటన!!

గూడలూరులో యథావిధిగా ప్రతి దినం భక్తులకు తనదైన ఆధ్యాత్మికతత్త్వం, సమరససన్మార్గోపదేశాలు చేస్తూ, వేలకొలది భక్తుల హృదయాలలో చోటు చేసుకున్నారు స్వామి. ఈ ఉపన్యాసాలు రాత్రి వరకు కొనసాగేవి. ప్రతిదినము స్వామి ప్రవచనాలు వినడానికి గూడలూరుకు దరిదాపుల్లో ఉన్న మంజుకుప్పంనుండి రామకృష్ణపిళ్ళ వచ్చేవాడు. కార్యక్రమం అయిన తరువాత ఒంటరిగా మంజుకుప్పానికి వెళ్ళవలసివచ్చేది. తిరుగుప్రయాణంలో చీకటి, నిర్మానుష్యమైన మార్గం, కాబట్టి ఒక్కోసారి భయపడేవాడు. ఇట్లా భయం కలిగినప్పుడు ఒకమనిషి దివిటీ చేతబట్టుకొని తనకంటే రెండడుగులు



అగ్రగామిగా పోవడం, భయం తొలగిన మరుసటి క్షణమే అతడదృశ్యమైపోవడం జరుగుతుంది. అతడెవడు? ప్రతిరోజు అతడామార్గంలో దివిటీ పట్టుకొని వెళ్లేది ఎందుకని? కనుక్కోవడానికి రామకృష్ణ స్వామినే ఆశ్రయించాడు ఈ సందేహనివృత్తికి. స్వామి ఏమీతెలియని అమాయకుడిలాగా, విని "అట్టాగా, ఆశ్చర్యంగా ఉందే" అని అంతా పైన ఉన్నవాని లీలావిశేషాలని చెప్పి ఊరకున్నారు.

మరొకసారి గుడలూరికి దగ్గరగా తిరుప్పాదిరి పులిమరను దివ్యక్షేత్రమున్నది. అక్కడ ప్రతి సంవత్సరం ఎంతోవేడుకగా ఉత్సవాలు జరిగేవి. ఆ యేడు బ్రహ్మ సమాజం వారు ఆ ఊరికి, ఉత్సవం సందర్భంగా చాలమందిని కలుసుకోవచ్చునని, వారి మతప్రచారం మరింత విస్తృతంగా చేయవచ్చని, వచ్చారు. శ్రీధరునినాయకత్వంలో ఈ ప్రచారోద్యమం అక్కడ ముమ్మరంగా సాగుతూ ఉన్నది. విగ్రహారాధనను నిరసిస్తూ, అది అజ్ఞానులు చేసేపని. మూఢాచారం. దీనిని అందరూ నిషేధించాలని విసుగు విరామంలేకుండా ప్రసంగాలు సాగిస్తున్నారు.

శిష్యులద్వారా విషయం తెలిసికొన్నస్వామి బ్రహ్మసమాజంవారికి వారు విగ్రహారాధనను ఆక్షేపించడం సబబుకాదని, అనాదిగా మహనీయు లెందరో ప్రతిపాదించి, దేవాలయాలు నిర్మించి, చక్కని విగ్రహాలు ప్రతిష్ఠింపజేసి, మానవుని ఉత్తమస్థితికి మార్గనిర్దేశం చేశారు. విగ్రహారాధన కూడా ఒకముఖ్యఅంశమని. కాబట్టి వారి ప్రచారములో ఈ అంశాన్ని తొలగించాలని కోరారు స్వామి సౌజన్యంతో. ఈ లేఖలోని అంశములను తార్కికంగా ఢీ కొనడానికి వీలుపడక అవసరానికి తగ్గట్టు ఏదో రెండుపంక్తులు వ్రాసి ప్రత్యుత్తరాన్ని పంపినారు. కానీ ఉద్యమాన్ని సాగిస్తూనే ప్రసంగాల తీరులో మార్పులేక బ్రహ్మసమాజంవారు చెలరేగుతున్నారు. ప్రత్యేకించి శ్రీధరనాయకుని ఉపన్యాసాల వల్ల కొందరిలో విగ్రహారాధన వల్ల ప్రయోజనాలు లేవు, అది అనాగరక మానవజాతి ఆచారాల అవశేషం. దాన్ని మానడం ఆధ్యాత్మిక ప్రగతి చిహ్నమనే భావన కలుగుతోన్నది. కాబట్టి ఈ సందేహప్రాణులను సరైన మార్గంలో

ఉంచడానికి, బ్రహ్మసమాజంవారి ఆట కట్టించడానికి శ్రీవారు చొరవ తీసుకొని శ్రీధరునితో ప్రత్యక్షంగా వాదించవలెనని పురికొల్పి, ఇరువురను ఒకవేదికపైకి చేర్చారు. వాద ప్రతివాదాలు సాగాయి. జ్ఞానులకు విగ్రహారాధన అవసరం లేదు. సామాన్యులకు భక్తిమార్గం సులభం కనుక ఈ మార్గంలో విగ్రహారాధనకు ప్రాముఖ్యం ఉన్నది. మనసున కట్టే అందని పరబ్రహ్మతత్వాన్ని కొలిచేందుకు విగ్రహారాధన బాగ ఉపకరిస్తుంది. అనాదిగా ప్రాజ్ఞులు విగ్రహారాధన, సత్కర్మలాచరించడం భక్తికి తొలిమెట్టని, తద్వారా జ్ఞానప్రాప్తి పొంది మానవుడు మాధవుడౌతాడని, అంటున్నారుగదా.

శ్రీధరుడు తనవాదాన్ని గట్టిగానే వినిపించాడు. కానీ చివరి విజయం శ్రీవారిదే. ఒకానొక ఘట్టంలో శ్రీధరుడు “అయ్యా, ఈ వాదననిప్పటికి ఆపుదాము. తదుపరి నేను చెప్పదలచిన వాదాంశాలను లేఖ ద్వారా మీకందిస్తాను” అని వాద వేదికనుంచి నిష్క్రమించాడు.

భక్తులందరు, విగ్రహమనగా విశేషస్థానము వాటిని దేవదేహములుగా భావించి భక్తితో ఉపాసించిన తప్పక జ్ఞానోదయం కలుగుతుంది అని సంతృప్తితో సభ వీడి వెళ్ళారు.

గూడలూరులో మరోరోజు పండితులు అప్పాసామిసెట్టివారింటిలో స్వామి దర్శనార్థమై గుమిగూడారు. స్వామి దర్శనమునకు కొంత సమయం వేచియుండ వలసివచ్చినది. ఆ సమయంలో ఒక పండితుడు “శివునాజ్ఞ లేక చీమైన కదలదు” కాబట్టి అంతా దైవాధీనమని ప్రారంభించాడు భక్తగోష్టిని. మరోవిద్వాంసుడు దాన్ని ఆక్షేపిస్తూ “ఎవరి కర్మలకు వారే బాధ్యులు. అన్నిటిని భగవంతునిపైకి నెట్టడం సబబుకాదు” అన్నాడు. కాబట్టి ఈ ప్రపంచమున సుఖదుఃఖాలకు జీవుడే కారకుడుగాని దేవుడు కాడని మరీ గంభీరంగా ఉపన్యసించాడు. ఇరుపక్షాలు వారి వారి వాదనలు బలపరచుకుంటూ ఉండగా ఇంతలో రామలింగస్వామి అక్కడ ప్రత్యక్షమైనాడు. వారు ఏ విషయమై వాదులాటకు దిగినారో స్వామి కెరుకే. అందువల్ల స్వామి వారిని కూర్చుండమని



దిగంబరసన్యాసి, ఆతనికి అరటిపండ్లిచ్చినవాడు, రాతితో కొట్టినవాడు, ముచ్చురిని న్యాయాధిపతిచెంతకు పిలుచుకొని వచ్చి న్యాయనిర్ణయం చేసినవాడు. ఈ నలువురి కథను చెప్పారు.

**“ధీ వరులు భేదరహితులు**
**దైవాధీనంబ యండ్రు తమ పనులెల్లన్**
**భావింప భేదగుణు లిల**
**జీవుడె కారకుడటంచుఁ జెప్పుదు రెపుడున్”**

అని స్వామి యుక్తియుక్తంగా చెప్పవలసిన విషయాన్ని చెప్పగా అందరు సంతోషించి శ్రీవారిని ప్రస్తుతించారు.

ఒకనాడు రామలింగస్వామి అప్పాసామిసెట్టి ఇంటిలో బసచేసియున్నప్పుడు, రాత్రివేళ ఒక ఆగంతకుడు, అపరిచయస్థుడు లోన ప్రవేశించాడు. ఇంటి అరుగుమీద కూర్చునియున్నవారు దీనిని గమనించి ఓకొత్తవ్యక్తి ఎవరినీ అడగకుండా సరాసరి లోనికి వెళ్ళడం నచ్చక, వెంటనే ఇంటిలోనికి ప్రవేశించి అతనికోసం ఇల్లంతా గాలించారు. స్వామిఉన్నగదికి వచ్చి విషయాన్ని విన్నవించగా నవ్వుతూ స్వామి అన్నారు “అయ్యలారా! వచ్చినవారు ఒక సిద్ధపురుషుడు. నన్ను చూడడానికి ఏతెంచాడు. ఈ పాటికి కాశిచేరి ఉంటాడతడు. ఇదిగో ఆతడిచ్చిన లడ్డు తీసుకోండి” అని లడ్డును అందరికి స్వామి పంచిపెట్టారు.

మంజుకుప్పం తాలూకా తాహసీల్దారు వేంకటసుబ్బయ్య. ఆ రోజుల్లో తాహసీల్దార్ గ్రామానికి ఆఫీసు పనిమీద వస్తున్నాడంటే, ఊరికి కొన్ని మైళ్ళదూరంనుండి, వారి రాకను రైతులకు, ఉద్యోగులకు, ఇతరులకు తెలియజేయడానికి, తాహసీల్దారు బండికి ముందుగా కొమ్మును ఊదుచూ ఒకవ్యక్తి పరుగులిడుతు రావాలి. ఒకరోజు ఆ తాహసీల్దార్ స్వామిని దర్శించడానికి స్వామివిడిదికి వచ్చి సమరస సన్మార్గోపదేశాన్ని వింటూ సమీపంలో కూర్చున్నాడు. ఆ రోజు కొమ్మునూదుతూ తాహసీల్దార్

వేంకటసుబ్బయ్యని పిలుచుకొని వచ్చిన వ్యక్తి అన్నం తినకనే పనికి వచ్చి పరుగులిడి అలసి ఆయాసంతో, చెమ్మటలు నిండిన శరీరంతో స్వామి బస సమీపంలో కూలబడ్డాడు. కరుణామూర్తి స్వామి ఈ హృదయవిదారకదృశ్యాన్ని చూచి, ఎదురుగా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చొని ఉన్న తాహసీల్దారుని నిలదీసి "నీవు బండిలో రావడం, నీముందు నీ వంటి మనుజుడొకడు ఆకలితో మాడుతూ పరుగులిడి రావడం ఏం న్యాయం? ఇకపై ఈ హింసాత్మకమైన ఆనవాయితీని ఆపాలి" అని బోధించి తాహసీల్దారు హృదయంలో కారుణ్య భావానికి తలుపులు తెరిచారు. ఆ పిమ్మట తాహసీల్దారు తాను గమ్యస్థానానికి చేరటానికి ముందుగానే తనరాకను తెలిపేందుకు కొమ్మునూదే పద్ధతిని పాటించడం జరిగింది.

మరో ఉదంతం. ఒకనాడు విన్నలూరువద్ద స్వామి ఏదో తీవ్రాలోచనామగ్నుడై పోతూ ఉన్నప్పుడు, అదే దారిలో పోతూ ఉండిన పురాణ ప్రచారకుడు వేంబయ్య చూచి "అయ్యా మీరెవరు?" అని ప్రశ్నించాడు. స్వామి "నేను నీలవ్యాపారి" అని చెప్పి తనదారిన తాను సాగిపోతూ ఉండినప్పుడు, వేంబయ్య ఈ విచిత్రమైన వ్యాపారి ఎవరై యుంటాడని మరోసారి సంధించి సంభాషింప ప్రయత్నించినప్పుడు, వడివడిగా నడుస్తూ ఉండిన స్వామి అదృశ్యమైపోయారు. వేంబయ్యకు విషయం స్ఫురించి ఆ వ్యక్తి సామాన్యుడు కాడన్న భావం కలిగింది. తాను "నీలవ్యాపారి" ననడంలోని భావాన్ని గురించి వేంబయ్య పదేపదే తలచుకుంటూ వెళ్ళాడు. "నీల" మంటే నలుపు. మాయ, అజ్ఞానం. ఊరూరికి వెళ్ళి మనుజులవద్ద ఉండే అజ్ఞానాన్ని కొనుక్కునేవాడు తానట. అంటే వారిలో అజ్ఞానం తొలగించి జ్ఞానాన్ని నింపడమన్నమాట. ఎంత భావగర్భితమైన మాట స్వామినోటవచ్చిన దా మాట!

ఇలా ఎన్ని అద్భుతాలు, ఎన్ని మహిమలు స్వామి దైనందిన జీవితంలో జరిగాయో పూర్తి దాఖలాలు లేవు. వేట్టవలం జమీన్‌దారు అప్పాసామి పండారి భార్య లిరువురు. వారిలో పెద్దభార్యకు మానసికవ్యాధి–బ్రహ్మరాక్షసి ఆమెనావహించిందని, అందువల్ల ఆవిడ అసహజ ప్రవర్తనలతో భర్తను, ఇతర పరివారాన్ని భయభ్రాంతులకు గురిచేస్తూ ఉన్నది ప్రతినిత్యం. ఇక రెండోభార్యకు



మహోదరమనేవ్యాధి. ఇరువురి స్వస్థత కోసం ఆ జమీందారు పడనిపాట్లులేవు. చేయనివైద్యం లేదు, మొక్కనిదైవంలేదు. పిలిపించని మాంత్రికుడు లేడు. అన్ని ప్రయత్నాలు నిష్ఫలమైన తరుణంలో వీరు వారు చెప్పుకొంటూ ఉండగా, రామలింగస్వామి అద్భుతమహిమ ఆతని చెవులలో పడింది. వెంటనే అతను స్వామిని పిలిపించి, తన భార్యల ఆరోగ్యాన్ని బాగుపరచుకొన్నాడు. అది మొద లాతడు శ్రీవారిని తమ ఇలవేలుపుగా స్వీకరించి, కొలువడం ప్రారంభించి, ఆయన తరువాతకూడా స్వామినే తరతరాలు ఆరాధించుమని చెప్పి గతించారు. ఆయన అభీష్టం ఈనాటికీ ఆయన కుటుంబంవారు శ్రీరామలింగస్వామిని ఇలవేలుపుగా ఆరాధిస్తున్నారు.

ఆ ఊళ్ళో ఒక సచ్ఛీలుడు కల్లుపట్టి అయ్యర్, శ్రీవారి సన్నిధికి వచ్చి, నమస్కరించి తనకు జ్ఞానోపదేశంచేసి ఉద్ధరించుమని ప్రార్థించినాడు. స్వాముల వారందు కంగీకరించి, ఆతనిని తనతోనే ఉండుమని, వేట్టువలం జమీర్ దారి గ్రామాన్నుంచి నిష్క్రమించినపుడు ఆతనిని వెంటబెట్టుకొని వడలూరు చేరుకొన్నారు. అయ్యర్‌కు ఆశ్రయాన్ని ఏర్పాటు చేసి అక్కడే ఉండమన్నా రతనిని. అయ్యర్ అభీష్టంనెరవేరి, ఆయన మనుగడ ధన్యమైంది.

వడలూరులో మకాం చేసినప్పుడు స్వామికి ఒకమంచి ఆలోచన స్ఫురించింది. ఆశ్రమానికి అనునిత్యం వచ్చిపోయే భక్తులు, ఆహారవసతి సౌకర్యాలులేక నానా ఇబ్బందులకు గురి అవుతున్నారు. దినదినానికి భక్తుల సంఖ్య పెరిగిపోతూ ఉన్నది. కాబట్టి భక్తజనుల ఆకలిబాధను తొలగించడానికి ఒక ధర్మశాల నేర్పరచి, వారికి తినడానికి, ఉండటానికి కూడా వసతి ఏర్పాటు చేయవలెనని సంకల్పించినారు. శిష్యులు, శ్రేయోభిలాషులు, దర్శనానికి విచ్చేసే శ్రీమంతులతో చర్చించి, ధర్మశాల నిర్మాణానికి వడలూరు వెలుపల స్థలం అనువైనదని నిశ్చయించినారు స్వామివారు.

ధర్మస్థలం అక్కడే ఉండాలన్న నిర్ణయానికి అనేక కారణాలు, వాటిలో ముఖ్యమైనవి చుట్టుప్రక్కల అనేక పుణ్యక్షేత్రాలున్నాయి, నాలుగు ముఖ్యమైన

నదులు నమీపంలో ప్రవహిస్తాయి. ఆ స్థలం నుండి చిదంబరంవైపు దృష్టిసారిస్తే ఆ దివ్యక్షేత్రాన నెలకొన్న నటరాజ దేవాలయం నాలుగు గోపురాలు కనుల కానుతాయి. వడలూరు చెంత స్వామి ధర్మశాలను నిర్మింప ఏర్పాట్లు చేస్తున్నారని ఆ ఊరివారి ఆనందాని కంతులేదు. వారివారిభూములను ధర్మశాల కోసమని దానంచేయడానికి ముందుకువచ్చారు. వారికివారే స్వచ్ఛందంగా దానం చేయబడిన భూమి 106 ఎకరాలు శ్రీవారిపేర పట్టా చేయించారు వడలూరు భూస్వాములు.

ఒక సుముహూర్తాన స్వాములవారి అభీష్టం ప్రకారం ధర్మశాల నిర్మాణం ప్రారంభమైనది. వేగంగా పనులవుతున్నాయి. ప్రతిదినము భక్తులు వచ్చి విరాళాలు చెల్లించి నిర్మాణం సజావుగా సాగడానికి బాగా సహకరిస్తున్నారు. శ్రమదానం చేసేవారు అలుపు సొలుపు లేకుండా శ్రమిస్తున్నారు. ధర్మశాల రూపుదాల్చే రోజుల్లో స్వామివారి మదిలో వడలూరులో మరో చోట జ్ఞానసభ నొకదానిని స్థాపించాలన్న తలంపు కలిగింది. వెంటనే 53 ఎకరాల స్థలాన్ని సేకరించి తన ఆధ్యాత్మిక సిద్ధాంతం సమరసశుద్ధ సత్యజ్ఞానం పంచేందుకు సభామందిరం పేరుతో మరోభవన నిర్మాణం ప్రారంభమైనది. స్వామి దీనికి ఉత్తరజ్ఞానచిదంబరమని కూడా నామకరణం చేశారు. ఈ భవనం స్వామి యిచ్చిన నమూనా ప్రకారం అష్టకోణాకారంతో జ్ఞానసభ తామరపుష్పంవలె కట్టబడింది. ఈ రెండు భవనాల నిర్మాణం జరుగుతుండగా స్వామి అచ్చటికి క్రోసు దూరంలో ఉన్న మేట్టుకుప్పంలో తనకు ఆశ్రమాన్ని ఏర్పాటుచేసుకొని అక్కడే ఉంటూ, తరచు భవననిర్మాణ ప్రగతిని పర్యవేక్షిస్తూ, నిర్దేశిస్తూ, సమరససన్మార్గాన్ని గురించిన ఉపన్యాసాలు చేస్తూ ఉన్నారు. ఈ ఆశ్రమ భవనానికి సిద్ధివళీకమనే పేరు పెట్టుకొన్నారు స్వామివారు.

ధర్మశాల, జ్ఞాన సభామందిర నిర్మాణం అత్యుత్సాహభరితంగా సాగుతూ ఉన్నది. ధ్వజస్తంభం ప్రతిష్ఠించాలి. కాంట్రాక్టరు ఆరుమొగముదలియార్ సరియైన మానుకోసం అనేక ప్రయత్నాలు చేశాడు. ఏ ప్రయత్నమూ ఫలింపక, స్వామి పనుపున చెన్నపురి కేగి వెదకిన ప్రయత్నాలు కూడా వృథా అయినవి. నిరాశతో



తిరిగి వచ్చి శ్రీవారికి విషయం చెప్పి ఏమీ తోచక నిస్సహాయుడై ఎదుట నుంచున్నాడు. అప్పుడు స్వామి, “అయ్య, ఆరుముగం, మరోసారి మదరాసుకు వెళ్ళిరా. ఫలానాచోట విచారించు” అను మాకులదొడ్డి చిరునామా చెప్పగా హుటాహుటిన మొదలియార్ మదరాసు చేరి, మాకులదొడ్డిని వెదకి కనిపెట్టి. అక్కడ పరచియున్న పెద్దపెద్ద మాకులను చూస్తూ వెడుతూ ఉన్నాడు. ఒక మానుపైన స్వామి కూర్చొన్నట్టు మొదలియార్‌కు తోచగా, ఏమి స్వామి ఇక్కడికెప్పుడు వచ్చారు? అని ఆశ్చర్యంతో స్వామివైపు అడుగులు వేస్తుండగా” ఆరుముగం, చూడు ఈ మాను మనకు సరిపోతుంది కదా” అని చెప్పి అదృశ్యమైనారు. అలా ఉంటాయి స్వామి లీలలు. ఆరుముగం వెంటనే ఆ మాను కొని, వడలూరు చేరే ఏర్పాట్లు చేసి పయనమైనాడు. ఆ వీధిలో ధ్వజస్తంభ వ్యవస్థాపన జరిగింది.

ధర్మశాల, 106 ఎకరాల విస్తీర్ణప్రదేశంలో, జ్ఞానసభ 53 ఎకరాల నివేశనంలో ఒకేసారి, నిర్మింపబడే పెద్ద కట్టడాలు పనులు ఉత్సాహంతో, తొందరతొందరగా జరుగుతున్నవి. వందలాది పనివారు శ్రమిస్తూఉన్నారు. ఈ సందర్భంగా పైన కట్టిన సారవాలమీద పనిచేసేవారు ఇటుఅటు తిరుగుతున్నారు, ఎత్తులకు ఇటుకలు, కలప మోస్తూ కొందరున్నారు. ఈ హడావిడిలో ప్రతిరోజు ప్రమాదాలు చిన్నవి, పెద్దవి సంభవించడం అరుదు కాదు. కానీ ఇది భగవత్కార్యం. దివ్యపురుషులు శ్రీ జ్యోతి రామలింగస్వామి పర్యవేక్షణ. కాబట్టి ఏ అవాంతరం, విపత్తు జరగకుండా నిర్మాణాలు సలక్షణంగా పూర్తి అయ్యాయంటే అది నిజంగా భగవల్లీలే.

ఈవిధంగా సత్య ధర్మశాల, జ్ఞానసభా భవనాలు సుందరంగా రూపొందాయి. ప్రభవనామసంవత్సరం, అరవనెల వైయ్యాశి(వృషభమాసం) 11 వ తేదికి సరియగు గురువారం నాడు ధర్మశాలా గృహప్రవేశ మహోత్సవం జరిగింది. స్వామి రచించిన జీవకారుణ్యపద్ధతి అనే గ్రంథంనుంచి పాటలు, పద్యాలను చిదంబరం వేంకటసుబ్బయ్యదీక్షితులు చదివి ఆ భవనసముదాయంలో సమరససన్మార్గతత్త్వ ప్రచారానికి నాంది పలికారు. అక్కడే

సమరసవేదపాఠశాలనొకటి స్థాపించారు స్వామివారు. ఆ పాఠశాలలో తిరువళ్ళువర్ రచించిన ద్రావిడవేదమైన తిరుక్కురల్‌ను నిర్బంధ పాఠ్యాంశంగా చేయడం జరిగింది.

ధర్మశాల ప్రారంభోత్సవంనాడు మూడుదినములు పదహారువేలమంది భోజనాలు చేశారు. నాటిమొదలు, నిరంతరంగా, సత్యధర్మశాలలో భోజన సంతర్పణ జరుగుతూనే ఉన్నది. ఆకొన్నవారెవరువచ్చినా భోజన సమయానికి, కొరతలేకుండా అన్నంపెట్టి ఆదరించవలెనన్న శ్రీవారి ఆజ్ఞానుసారం ఈ అన్నదానయజ్ఞం నిరంతరం కొనసాగుతూ ఉన్నది. ధర్మశాలలో పొయ్యిలో పిల్లి నిదురపోకూడదన్నది స్వాములవారి ఆదేశం. ఈ ఆదేశం తు.చ. తప్పకుండా నేటికీ, రేపటికీ పాటించబడటం ఒక గొప్పవిశేషం.

అక్షయపాత్రను గురించి మనము విన్నాం. మహాభారతంలో ఏ విధంగా శ్రీకృష్ణ భగవానుడు ద్రౌపదికి అక్షయపాత్ర నిచ్చి, పాండవులను దుర్వాస మహాముని కటాక్షమునకు పాత్రులయ్యేటట్లు చేశాడో చదువుకున్నాం. గతశతాబ్దంచివర హిమాలయపర్వత గుహలలో తపోనిమగ్నులైన మహానుభావులు ఒకపరి పుట్టపర్తికి వచ్చి, భగవాన్ సత్యసాయి కృపకుపాత్రులై అక్షయపాత్రను తీసుకొని వారి గుహలకు వెళ్ళి భోజన విషయమై నిశ్చింతగా ఉంటున్నారని తెలుసుకున్నాం. ఈ ఉదంతాల వలెనే రామలింగస్వామి ధర్మశాలలో కూడా కొన్ని సంఘటనలు జరిగాయి. ఒక రోజు రాత్రి ఆరగించడానికి వచ్చిన వారందరికి వడ్డనలు పూర్తయి, ఇక వంటగది తలుపులు మూద్దామని భక్తులు సమాయత్తమైనప్పుడు ఉన్నట్టుండి వందకుమించిన అతిథులు, ఆకొన్నవారు వచ్చేశారు. పరిజనులకేమీ తోచలేదు. పాత్రలలో మిగిలినది బహుస్వల్పం. వచ్చినవారికెంతమాత్రం సరిపోదు. ఇక మళ్ళీ వంటచేసి పెట్టడం దుస్సాధ్యం అని బిత్తరపోయినారు వారు. ఇది తెలుసుకొన్న స్వాములవారు హుటాహుటిన వంటగదికి వచ్చి, "ఏం ఫర్వాలేదు, గాభరావద్దు. ఆకులు పరచండి వడ్డించండి" అని హెచ్చరించి, వారే అతిథులను కూర్చోమని, శాకాదులున్న పాత్రను చేతికి తీసుకున్నారు స్వయంగా వడ్డించడానికి. వచ్చిన



వారందరూ తృప్తిగా భుజించి లేచారు. అప్పుడనిపించిందక్కడ ఉన్న భక్త బృందానికి, పరిజనులకు శ్రీవారు అక్షయపాత్రను వంటగదికి తెచ్చారేమోనని!

మరోరోజు ధర్మశాల ఉగ్రాణంలో బియ్యం మిగతా వంటసామగ్రి ఖాళీ అయిపోయినది. రేపటికి అన్నదానం ఎలా చెయ్యాలి భగవంతుడా అని తలలుపట్టుకొని దిగాలుగా ఉన్న పరిజనుల మధ్య స్వామి కూర్చొని కాసేపు ధ్యానసమాధిలో ఉండి, "అంతా రేపటి ఉదయాని కల్లా వస్తుంది భయంవద్దు" అని భరోసా ఇచ్చారు. వారన్నట్లే మరుసటి రోజు సూర్యోదయంవేళకు మూడు బండ్లనిండుగా బియ్యపు బస్తాలు, తక్కిన సామగ్రి పప్పు, నూనె వగైరాలు వంటశాలను చేరుకున్నాయి. పరిజనులు పరుగున వచ్చి "ఈ సామగ్రి ఎవరుపంపింది? మీరెక్కడ నుండి వచ్చారు?" అని ప్రశ్నలవర్షం కురిపించారు, అవి తెచ్చినవారి మీద. వచ్చిన వారిలో ముఖ్యుడు "అయ్యలారా! నేను తిరుత్తురై ఊరులో ఒక షావుకారును. స్వాములవారు గడచిన రాత్రి నా యింటికి వచ్చి మా మర్యాదలు స్వీకరించి మమ్మాశీర్వదించి, ఈ సామగ్రులను వడలూరు ధర్మశాలకు చేర్చుమ"ని ఆదేశించారు. ఆ ప్రకారం మేమందరము ధర్మశాలకు వచ్చియున్నామని చెప్పగా ధర్మశాల సిబ్బంది అవాక్కయి, ఆతనిని స్వామివారికడకు తీసుకొని పోయి జరిగినదంతా విన్నవించిరి. విని స్వాములవారు చిరునగవుతో "అట్లానా" అని పలుకుతూ షావుకారుకు విభూతిప్రసాదములిచ్చి దీవించి పంపినాడు.

దైవాంశ సంభూతులకే సాధ్యమైన ఇట్లాంటి మహిమలు, అద్భుతాలు, మానవాతీతకార్యాలు ఎన్నో చేశారు స్వామి రామలింగం. ఒకనాడొక తుంటరివాడు, మతద్వేషాలను మనసులో దాచుకొని, "శరీరమంతా నూనె పూసుకొని, అక్కడక్కడా దూది అంటించుకొని" స్వాములవారి విడిదికి పరుగునవచ్చి "స్వామీ! నన్ను మీరే కాపాడాలి. నా ఒళ్ళంతా కురుపులు. వీటి వలన నేను పడే బాధ తొలగించండి. ఈ పని చేయడానికి మీరే సమర్థులు" అని నటిస్తూ దీనంగా వేడుకొన్నాడు. యథావిధిగా స్వామి చిరునవ్వు కురిపించి "బాబూ! త్వరలోనే నీ బాధ తొలగిపోతుంది. నీకు ఆరోగ్యం చేకూరుతుంద"ని

చెప్పి, ప్రసాదమిచ్చి పంపివేసాడు. ఆ తుంటరి, ఎగతాళిగా నవ్వుకుంటూ వెలుపల వేచియున్న తోటి తుంటరుల మధ్యకు వచ్చి, చూచారా మిత్రులారా! నేను ఈ స్వామిని ఎలా ఏమార్చానో" అని వెకిలిగా నవ్వుతూ, ఆడుతూ, శరీరమున కంటించుకొన్న దూది ముక్కలను తీయడం ప్రారంభించాడు. దూది అంటిన చోట్లలో పెద్దపెద్ద కురుపులు, బొబ్బలు, చీము, నెత్తురు కారడం జరిగింది. ఆ యువకునికి తెలియవచ్చింది; ఇదంతా స్వామి పనే అని. వెంటనే స్వామి పాదాలమీద వ్రాలిపోయాడు. కనుల నీరుకారుతూ ఉండగా "నా తప్పు క్షమించి నన్ను కాపాడు స్వామీ" అని వెక్కి వెక్కి ఏడుస్తూ ఉన్నాడు. రామలింగస్వామి ఆతణ్ణి క్షమించి, విభూతి నిచ్చి, దగ్గరే ఉన్న బావివద్దకు వెళ్ళి స్నానం చేసి రమ్మన్నారు. అట్లాగే ఆ తుంటరి, మునుపటి గుణములుమాని, స్వామికి విధేయుడై స్నానంచేసి, కురుపులు వెంటనే మాయమైపోగా, మళ్ళీ స్వామి సన్నిధికి వెళ్ళి కాళ్లపై బడి మ్రొక్కి ఆ చోటు వీడాడు.

కుళ్ళాణ్‌చావడి అనే ఊళ్ళో ఒక మహమ్మదీయభక్తుడు పోలీసు హెడ్‌కానిస్టేబుల్‌గా కొలువులో ఉన్నాడు. ఒకసారి స్వామి ఆ ఊరికి విచ్చేసి సాయంసమయ ఉపన్యాసకార్యక్రమాలు ముగించిన తరువాత భక్తులకు విభూతి ప్రసాదాలు పంచుతున్నారు. ఆ సందర్భంలో ఆ మహమ్మదీయుడు స్వామి ఉన్న వేదికమీదికెక్కి దగ్గరకు వచ్చి, ఒక కొత్తవస్త్రాన్ని సమర్పించాడు. భక్తి పూర్వకంగా సమర్పించి స్వాములవారిని ధరించి ఉదయం వరకు అలానే ఉంచుకోమని ప్రార్థించాడు. స్వామి అంగీకరించి ఆ వస్త్రాన్ని ధరించారు. ఆ రాత్రి అక్కడే బసంగీ ప్రసాదాలు తీసుకొన్న తరువాత స్వామి అక్కడే నిదురపోతున్నప్పుడు, చీకటిలో ఒక దొంగ మెల్లగా స్వామి వద్దకుచేరి, ఆయన ఒంటిపై కప్పుకొన్న కొత్త వస్త్రాన్ని లాగడం ప్రారంభించాడు. ఆ వస్త్రాన్నిచ్చిన హెడ్‌కానిస్టేబుల్ ఎట్లాగో దీన్ని పసిగట్టి, వెంటనే దొంగను పట్టుకున్నాడు. చేస్తున్నది పోలీసు కొలువుగదా! అప్పుడు స్వామివారు హెడ్‌కానిస్టేబుల్‌ను సమాధానపరచి, దొంగకు ఆ వస్త్రాన్నిచ్చి పంపారు.



మేట్టుకుప్పం ఆశ్రమం సిద్ధివళీకంలో స్వామి ప్రవచనం చేస్తున్నారు. ఆ సమయంలో ఒక కుంటిమేకపిల్ల ఓరగా నిలబడి వింటున్నదా అనిపించేటట్టు కనబడ్డది. ప్రవచనానంతరం భక్తులు, సభాసదులు సిద్ధివళీక భవనానికి ప్రదక్షిణలుచేస్తున్నప్పుడు, ఈ కుంటి మేకపిల్ల కూడా ప్రదక్షిణంలో పాల్గొనడం శ్రీవారు చూచారు. వెంటనే ఒక భక్తుణ్ణి పిలిచి "అయ్యా! ఈ మేకపిల్లకు కూడా భోజనం పెట్టండి" అని ఆనతిచ్చారు. అంతటి జీవకారుణ్యం రూపుదాల్చిన మహనీయులు శ్రీరామలింగస్వామి. వడలూరు హరిజనవాడలో అమావాస అనే పేరుగల ఒక దళితుడున్నాడు. అధ్యాత్మిక చింతన కలిగి కొంత పేరున్నవాడతడు. ఒకనాడు స్వాములవారు అతనిని ఆశ్రమానికి పిలిపించి, "అయ్యా, మాంసభక్షణం మానుకో. చచ్చిన గొడ్లను, గేదెలను ఇక మీదట పూడ్చివేయి" అని చెప్పి, ఆతనిని శాకాహారిని చేయటంతోపాటు, ఆ ఊరివారిలో చాలమందిని ఈ మార్గానికి తిప్పారు. ఆ సందర్భంలో అమావాస, స్వామితో మొరపెట్టుకొన్నాడు. ''స్వామీ! కుటుంబాన్ని పోషించడానికి అల్లాడుతున్నా''నన్నాడు. అప్పుడు వానిపై దయతో స్వామివారు కుటుంబపోషణకై నిత్యము అర్ధరూపాయ లభించే ఏర్పాటుచేసి వాని నాదుకొన్నారు.

ఒక పర్యాయం భక్తులు స్వామివారి ఫోటో తీయాలన్న సంకల్పంతో మదరాసునుండి ఫోటోగ్రాఫర్‌ను పిలిపించారు. ఆయనపేరు మాశిలామణి మొదలియార్. ఫోటోతీశారు, ఫోటోలో దిగలేదు స్వామివారు. రెండోసారి తీశారు, అదేసంగతి. ఇట్లా ఎనిమిదిసార్లు ఫోటోలు తీసినప్పటికీ ప్రయోజనంలేదు. భక్తులు బాధతో ఆ ప్రయత్నాన్ని విరమించారు. తరువాత కొన్నాళ్ళకు పస్రుట్టి గ్రామస్థుడొకడు భక్తి శ్రద్ధలతో శ్రీవారిని బోలిన ప్రతిమను చేసి, సహజసారూప్యత ఉట్టిపడేటట్లు అలంకరించి, ఆశ్రమానికి తెచ్చి స్వామి ముందుంచి ప్రణమిల్లినాడు. కానీ స్వామి ఆ భక్తుని ఎదుటే "పొన్నగుమేను మన్నయ్యెనా" అని పలుకుతూ ఆ ప్రతిమను నేలపై బడవేసి తుత్తునియలు చేశారు. తరువాత పస్రుట్టి భక్తుడు తన సంతృప్తి కోసం, మరో విగ్రహాన్ని రూపొందించి తన

ఇంటిలోనే ఉంచి పూజించుకొని ధన్యుడైనాడు. మనం శ్రీరామలింగస్వామి పటాన్ని అనేక చోట్లలో చూస్తున్నాం. ఈ పటాలన్నీ ఆ విగ్రహం యొక్క ప్రతిరూపాలే. ఈ ప్రతిరూపాన్నే మనమంతా ఈనాటికీ పూజిస్తున్నాము.

పుదుపేట గ్రామంలో త్రాగుటకు మంచినీరు కరవై ఊరివారందరు బాధపడుతున్నారు. ఆ ఊళ్లో రెండేబావులు. ఆ బావులలో నీరు ఉప్పుగా ఉంటవి. వేసవికాలంలో ఆ ఉప్పునీరుకూడా ఉండదు. రెండుబావులూ ఎండిపోతాయి. ఒకనాడు స్వామివారు అటువైపు ప్రయాణిస్తున్నారని తెలిసి, ఊరిలోని వారందరు మంగళవాద్యాలతో స్వామి సన్నిధికి వెళ్ళి త్రాగునీటికై వారు పడే కష్టాలను విన్నవించి కాపాడుమని ప్రార్థించారు. వారినాదరించి స్వామివారు పుదువేటకు వెళ్ళి ఒకచోట నుంచున్నారు. ఊరి పెద్దను పిలిచి "అయ్యా, ఆ బావినీళ్లు రెండుబిందెలు తెచ్చి నాపైన గ్రుమ్మరించే ఏర్పాటు చేయండి" అని చెప్పారు. ఆ ప్రకారమే కొందరు వెళ్ళి రెండు బిందెల నిండా ఉప్పునీటిని మోసుకొని వచ్చి, స్వామిని అభిషేకించినట్లు వారిమీద గుమ్మరించారు. వెంటనే కారుమబ్బులు కమ్మి భారీవర్షం కురిసి, బావులు మంచినీటితో నిండిపోయినవి. అప్పటినుండి, ఇప్పటికీ ఆ బావులలో నీరు అడుగంటదు. తాగడానికి రుచిగా ఉంటాయి.

మంజుకుప్పం కోర్టులో అధికారి రామచంద్రమొదలియార్ వడలూరుకు వచ్చి స్వామిని దర్శించుకొని, వారిని తన ఊరికి రమ్మని ఆహ్వానించినప్పుడు, ''సరే, వెంటనే బయలుదేరుతాం'' అని ఎద్దులబండి నొకదానిని ఏర్పాటుచేసుకొని పయనమైనారు. ఇరువురు మార్గమధ్యంలో దొంగలు పడ్డారు. బండి తోలువాడు, బంట్రోతు భయపడి పరుగులు తీశారు. దొంగలు మొదలియారును పట్టుకొని, ఆయనవ్రేళ్ళకున్న ఉంగరాలను తీసియిమ్మని గద్దించినారు. స్వామి వారిని సమీపించి, "అయ్యలారా! ఇవి మీకు అవసరంగా కావాలా?" అని ప్రశ్నిస్తుండగా ఆ దొంగలలో ఒకడు "ఈ నాజూకు మాటలు కట్టిపెట్టు" అని తీవ్రస్వరంతో స్వామిని కొట్టడానికి కట్టె పైకెత్తినాడు. ఎత్తినచేయి అలా బిగుసుకొనిపోయిన తక్షణమే స్వామి మహిమను తెలుసుకొని



స్వామిపాదాలపైన వ్రాలి క్షమించుమని వేడుకొన్నారు దొంగలు. వారిని క్షమించి తమదారివెంట బయలుదేరి వెళ్ళారు స్వామి, మొదలియార్.

మరో దిగ్భ్రాంతికరమైన సంఘటన. ఒకరోజు స్వామి బహిర్భూమికి వెళ్ళి, చాలసేపయినా రాలేదు. అప్పుడు శిష్యుడు వేలూరు షణ్ముఖపిళ్ళ వెలుపలి వచ్చి చూచి భయభ్రాంతికి గురైనాడు. స్వాములవారి శరీరభాగాలు వేరువేరయి పడియుండడం చూచి నోటమాట రాక గజగజ వణుకుతున్నాడు. అప్పుడు స్వామి సాధారణరూపంలో షణ్ముఖాన్ని సమీపించి "నీవు ఈ విధంగా వచ్చి చూడకూడద"ని హెచ్చరించి, షణ్ముఖంతో బాటు ధర్మశాలను చేరుకున్నారు స్వామి.

విజయరాఘవులునాయుడు కురింజపాదిలో హెడ్‌కానిస్టేబుల్. ఆయన ఏదో వ్యాధికి గురియై రోజురోజుకు చిక్కిపోతూ ఉన్నారు. ఎన్నో వైద్యాలు చేయించారు. వ్యాధిపీడ తొలగలేదు. చివరకు జీవితంపైన విరక్తితో తుదిప్రయత్నంగా స్వామివద్ద కొచ్చి మొఱపెట్టుకొన్నాడు. స్వామి శ్రీరామ నామస్తవం చేయుమని, తానే స్వయంగా పద్యాలల్లి, నాయుడికిచ్చి, "నయమవుతుంది, భయంవద్దు" అని భరోసా ఇచ్చి పంపారు. స్తవం ప్రారంభించిన కొద్దిరోజులలో వ్యాధితొలగి, నాయుడు పూర్ణారోగ్యం పొందినాడు.

ఈ విధంగా శ్రీరామలింగస్వామి అనేక మానవాతీత కార్యాలు చేశారు. మరో ఉదంతం చెప్పాలి. మదరాసులో ఒక క్రైస్తవభక్తుడు బీదరికంతో కుటుంబాన్ని పోషించుకోలేక, "స్వామీ, ఈ దీనుణ్ణి మీరే ఆదుకోవాలి" అని వారి పాదాలమీద వాలి ప్రణమిల్లినాడు. స్వామి కరుణించి, ఆతనికి పరుసవేది విద్యను కొంత నేర్పి, "అయ్యా! రోజుకు రెండు రూపాయలవిలువగల బంగారం చేసి, విక్రయించి నీ కుటుంబాన్ని పోషించుకో. అత్యాశకు పోవద్దు" అని చెప్పి పంపెను. ఆ భక్తుడు స్వామి ఆజ్ఞానుసారం రోజుకు రెండు రూపాయల రాబడితో సంతృప్తిగా జీవిస్తూఉండి, ఒకానొక దుర్ముహూర్తాన స్వామి ఆజ్ఞను మీరినాడు. ఆ రోజు తనచేష్ట ప్రభావం చూపించి రెండు రూపాయల రాబడి రాలేదు.

చేసిన తప్పునకు దుఃఖిస్తూ స్వామి సన్నిధి చేరి కన్నుల నీరు నింపుకొని నిలిచాడు. స్వామి జ్ఞానోపదేశంచేసి పంపాడు.

శ్రీ స్వాములవారు తన అవతారలక్ష్యం సిద్ధించినదని భావించి ఒక మంచి ముహూర్తము నిర్ణయించుకొని శివైక్యం జెందాలని నిశ్చయించారు. మేట్టుకుప్పంలో సిద్ధివళీక కుటీరంలో ఒకపెద్ద అద్దాన్ని తెప్పించి, అమర్చి దానిని నలభైరోజులు పూజించారు. తరువాత ఆ అద్దాన్ని సభాపతి శివాచార్యుల ద్వారా వడలూరు జ్ఞానసభకు చేర్పించారు. ఆ సభామందిరంలో ఆ నిలువుటద్దాన్ని అమర్చి, దాని ముందుభాగంలో ఒక పెద్ద దీపాన్ని స్థాపింపజేసి, ఆశ్రమభక్తులందరిచేత జ్యోతికి భక్తి శ్రద్ధలతో పూజాకార్యక్రమాలు ఏర్పరచారు. ఈ జ్యోతి పూజకు సంబంధించి ప్రతినెల ఒక పర్వదినం నియామకమైనది. అప్పటినుండి ప్రతిమాసం పుష్యమీనక్షత్రంలో జ్ఞానసభకు భక్తులు తండోపతండాలుగా వచ్చి జ్యోతిని సేవించడం, స్వామివారి ఆశీస్సులందుకోవడం ఒక పరిపాటి అయినది. మకరవాసజ్యోతి దర్శనం ఒక మహాపర్వమై నేటికినీ కొండాడబడటం విశేషం. దీనివల్ల మోక్షాన్ని కోరేవారికి మోక్షప్రాప్తి కల్గుతుందని భక్తుల పరమ విశ్వాసం.

వడలూరు జ్ఞానసభామందిరంలో ఈ జ్యోతి వెలుగుతూనేఉంది. ఏడుతెరలు తీసుకొని భక్తులు లోనికి వెళ్ళి జ్యోతి దర్శనం చేసుకొంటారు. ఆత్మజ్యోతి దర్శనానికి కప్పియున్న ఏడు మాయశక్తులను తొలగించుకోవాలి అని పెద్దలు చెబుతారుగదా! వడలూరులో జ్యోతిదర్శనంతో భక్తులు తరిస్తూన్నారు. శ్రీవారు మేట్టుకుప్పంలో సిద్ధివళీక ఆశ్రమంలో ఒక గదిలోనికి వెళ్ళడం, తలుపులు మూసికొని ఏకాంతంగా ధ్యానంలో గంటలు తరబడి కూర్చోవడం, మధ్యమధ్య ఒకటి రెండు సార్లు వెలుపలికి వచ్చి తాత్త్వికోపన్యాసాలుచేయడం జరుగుతున్నది. ఒక్కోసారి ఎన్నోరోజులు గదిలోపలనే ధ్యానసమాధిలో ఉండటం, సకృత్తుగా వెలుపలికి రావడం చేస్తున్నారు స్వామివారు.

ప్రత్యేకించి శ్రీముఖనామసంవత్సరం ధనుర్మాసం ప్రారంభమైనది మొదలుకొని వెలుపలికి వచ్చి ఉండే వ్యవధినికూడా బాగా తగ్గించేశారు.



చివరిరోజు అలా మెరుపుదర్శనమిచ్చినప్పుడు వారి అనుగ్రహభాషణంతో అన్నారు. "భక్తజనులారా! అంగడి పెట్టినా కొనేవారులేరు. మూసేశాను. మీ రికమీదట దైవానుగ్రహానికోసం ఈ దివ్యజ్యోతిని దర్శించి ప్రార్థించండి. ఇక నేను రెండున్నర గడియలు మాత్రమే మీకు కనబడగలను. ఆపిమ్మట సర్వాంతర్యామినై ఉంటాను. కృపాజ్యోతిస్స్వరూపాన్ని మీరు దర్శిస్తారు. అనేక అద్భుతాలు చూస్తారు. నేను గదిలోపలికి వెళ్ళి తలుపులు మూసుకుంటాను. ఎప్పటిలాగా. కొంత కాలము వరకు మీరెవరూ తలుపులు తట్టే ప్రయత్నం చేయకండి అని చెప్పి శ్రీవారు లోన ప్రవేశించి తలుపులు వేసుకున్నారు. శ్రీముఖనామసంవత్సరం తై నెల (అరవకాలంలో) 19 వ తేది, శుక్రవారంనాడు మాములు కాలండర్ ప్రకారం జనవరి 20, 1874. ఎన్నాళ్ళైనా, అలికిడిలేదు. స్వామి పునర్దర్శనమిస్తారన్న ఆశలేదు. ఈ నేపథ్యంలో భక్తులందరు దిగులుపడి ప్రార్థనలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, డాక్టర్, తాహసీల్‌దారు మిగతా అధికారులు జట్టుగా వచ్చి భక్తుల సమక్షంలో తలుపులు తెరిపించారు. ఈ తీసే ప్రయత్నంలో దురుసుగా ప్రవర్తించిన తాహశీల్దారుగారికి వెనువెంటనే ప్రతిఫలం దక్కింది. భక్తిప్రపత్తులతో ప్రవర్తించిన కలెక్టరు, డాక్టరు, తాహసీల్దారు దురవస్థను చూచి జాలిపడి ఆయన్ను బంట్రోతు సాయంతో ఇంటికి చేర్పించారు.

తలుపులు తెరిపించి స్వామి గదిలోనికి ప్రవేశించిన వారికి ఒక దివ్యజ్యోతి దర్శనము కలిగింది. స్వామి ఉన్న జాడ బొత్తిగా లేదు. అది శ్రీవారి మహిమ. వారు సిద్ధపురుషులు గదా. ఇట్టాంటి జీవన్ముక్తి పొందిన అవతారమూర్తి శ్రీరామలింగస్వామి.

మహాపురుషుల మహాభినిష్క్రమణం విలక్షణంగా ఉండటం వారివారి జీవిత చరిత్రల ద్వారా మనం తెలుసుకొంటాము. అయితే కొందరి విషయంలో ఈ ఘట్టం మరీ విలక్షణంగా ఉంటోంది. మంత్రాలయస్వామి రాఘవేంద్రులవారి మహాభినిష్క్రమణం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి సమాధి ఉదంతం గొప్ప ఉదాహరణ. జ్యోతి రామలింగస్వాములవారి విషయంలో ఈ ఘట్టం మరో ఉదాహరణ. గదిలోనికి వెళ్ళిన మహానుభావుడు ఏమైనట్టు?

కొన్ని రోజుల తర్వాత తలుపులు పగులగొట్టి లోనకు ప్రవేశించినవారు గదిలో భూగృహద్వారం ఏదైనా ఉన్నదా? పైకప్పుద్వారా అర్ధరాత్రి వేళ ఎవరికీ తెలియకుండా స్వామి ఆ గదిని వీడి ఎక్కడికైనా వెళ్ళిపోయారా? అని సంశయాలు వెళ్ళబుచ్చినారు అధికారబృందం స్వామి అన్వేషణలో. చివరకు ఆ సిద్ధపురుషుడు జ్యోతిరూపం దాల్చినవైనం వారి కవగతమైనది.

శ్రీవారు శ్రీజ్యోతిరామలింగస్వామిగా ప్రసిద్ధికెక్కి, నేటికీ భక్తజనులచే పూజలందుకుంటున్నారు. ఈ దివ్యపురుషుని సందేశాలు చాల విలక్షణమైనవి. విప్లవాత్మకమైనవి.

**1.** ఆధ్యాత్మిక ప్రపంచంలో జాతిభేదాలు నిషిద్ధం. అందరు పరస్పర సామరస్యంతో ఉండి తాను ప్రవచించిన సన్మార్గ బోధనల ననుసరించి జీవించాలి.

**2.** “తిరువరుట్పా” అన్న వారి రచన ఒక వరప్రసాదం. ఆ కృపానీతావళి వారి ఆధ్యాత్మిక సందేశాలకు, భాషా సౌందర్యానికి, సాహిత్యశిల్పానికి, భక్తిభావగంభీరతకు నిక్షేపం. తమిళనాట పండితపామర హృదయాలలో శాశ్వతంగా చోటు చేసుకొన్న మహోజ్వల కృతి రత్నమది.

**3.** వారి సమరససన్మార్గ బోధనలు ఆధ్యాత్మికప్రగతికి వినూత్నమైన రాచబాటలు.

**4.** కరుణామయుడుగా బుద్ధభగవానుని, ఏసుప్రభువును తలపింపచేసి, అహింసావ్రతాన్ని ఆదర్శప్రాయంగా పాటించి, “ఆత్మావత్సర్వభూతాని” అన్న సూక్తిని తు. చ. తప్పకుండా ఆచరించిన అవతారపురుషులు స్వామి.

**5.** ఐహిక సుఖాలకు విముఖులై, జితేంద్రియులై ,జ్యోతిర్మూర్తులై ప్రకాశించిన పరమ పవిత్ర స్వరూపులు రామలింగస్వాములవారు.

**6.** “కలౌ భక్తిః విశిష్యతే” అన్న ఆర్యోక్తి సత్యాన్ని ప్రకటించడానికి అనేక పుణ్యతీర్థాలను, క్షేత్రాలను సందర్శించి, ఆ క్షేత్రదేవతను కీర్తించి, ఆదిశంకరులను తలపింపజేసిన క్షేత్రజ్ఞులు వీరు.



**7.** హైందవ జనజీవన సంస్కృతిలో వివాదాస్పదమైన వర్ణాశ్రమధర్మ సంకల్ప వికల్పాలను భక్తజనుల హృదయాలనంటకుండ ఒక ప్రశాంత విప్లవాన్ని తెచ్చిన ఆధ్యాత్మిక ధీరపురుషులు జ్యోతి రామలింగస్వామి.

**8.** స్వామివారు జన్మించింది అక్టోబరు 05, 1823 లో; సిద్ధిపొందింది జనవరి 30, 1874. వారి మనుజరూప అవతారకాలం 47 సంవత్సరములు 4 నెలలకు నాలుగు రోజులు తక్కువ.

**9.** ఆయన భక్తజనుల కనుగ్రహించిన మంత్రపుష్పం ఆరుట్పెరుం జ్యోతి-తనిప్పెరుం కరుణై అంటే కృపామహాజ్యోతి!, పృథగ్భూత కారుణ్యమ!

Grace that flows from light
Grace that flows from supreme comparision.

**10.** మనజీవితాలు కరుణతో నిండుకొన్నప్పుడు భగవదనుగ్రహం మనపై కురుస్తుంది. మనం దైవాంశతో క్రమంగా సచ్చిదానంద స్వరూపులుగా పరిణామం జెందవచ్చు.

**11**. ఆయన మతం విశ్వమానవ సౌభ్రాతృత్వం. ఆయనమంత్రం కరుణ, కరుణ, కరుణ.

**12.** ఆయన భూలోక అవతారకాలాన్ని మూడుభాగాలుగా విభజిద్దాం:

అ. మదరాసు: 1825–1858

ఆ. కరుంగుళి: 1858–1867

ఇ. వడలూరు, మేట్టుకుప్పం: 1867–1874

**13.** ఆయన బాల్యం నుంచి దివ్యావతారపురుషుడు శ్రీ జ్ఞానసంబంధర్‌ను శైవ మతానుయాయులకు మానవులుగా అవతరించిన దివ్య పురుషులు నలుగురు. వారు అప్పర్, సుందరర్, జ్ఞాన సంబంధర్, మాణిక్యవాచకర్. వీరు నలువురు పరమ శైవభక్తులైన అరువదిముగ్గురు నయనార్లలోనివారు.

వీరిలో జ్ఞాన సంబంధర్‌ను కొందరు నయనార్లలో లెక్కించరు. తన నాదర్శంగా తీసుకొన్నారు. జ్ఞానసంబంధర్ పదునారేండ్లు జీవించి శివైక్యంచెందిన మహనీయుడు. క్రీ.శ. 7 వశతాబ్దికి జెందిన దివ్యపురుషుడు. ఆదిశంకరులకే స్ఫూర్తిగా నిలిచిన మహానుభావుడు. ఆదిశంకరులు తన సౌందర్యలహరిలో “ద్రావిడశిశువ”ని కీర్తించిన దీ తిరుజ్ఞానసంబంధర్‌నే.

రామలింగస్వామికి దివ్యజ్ఞాన పరిణతి వచ్చేవరకు ఆయన జ్ఞాన సంబంధర్‌నే తన గురుపీఠంలో అధిష్ఠింప చేసుకొన్నాడు.

“ఓ జ్ఞానసంబంధర్! సద్గురువర్యా! నీ ఉపదేశాలు నాలో ఉత్తేజాన్ని రేకెత్తించాయి. ఆత్మానుభవం ఆధారంగా దివ్యానుగ్రహానుభూతి లభిస్తుందని, విమలము, ఉదాత్తము అయిన ఆ అనుభూతినుండి శుద్ధశివానుభూతి నందుకోవచ్చునని నాకు బోధించావు ఓ జ్ఞానసంబంధర్! మూడేళ్ళ పసిబాలుడుగా నీవు అమ్మా అని ఆకలితో ఏడ్చినపుడు, జగజ్జనని పార్వతీమాత స్వయంగా నీ దగ్గర చేరి జ్ఞానక్షీరధారలతో నిన్ను అలరించింది. ఆ మహత్తర వరప్రసాదం వల్ల నీవు లోకానికి సత్యమార్గ నిర్దేశమిచ్చావు” అని ఆ గురుదేవుని స్తుతించారు రామలింగస్వామి.

**14.** తమిళదేశాన్ని తరతరాలుగా ఆధ్యాత్మిక సంస్కృతితో ముంచెత్తిన భక్తశిఖామణులు, సిద్ధులు, నాయనమార్లు, ఆళ్వారులు. దాక్షిణాత్య భక్తిఉద్యమం రథసారథులు వీరు– తిరుమూలర్ ఒక మహా సిద్ధపురుషుడు–పతంజలి ఆ వరంలో శిఖరాయమాణమైన అవతారపురుషుడు. శ్రీ జ్యోతిరామలింగస్వామి కూడా ఆ కోవకు చెందిన సిద్ధ అవతారమే.

**15.** జ్యోతిరామలింగస్వామి, తమిళనాట “వళ్ళలార్” గా విఖ్యాతిగాంచారు. “వళ్ళల్” అంటే “దానం” అని అర్థం. అన్నదానం, జ్ఞానదానం, కవితాదానం, భక్తిభావదానం, కరుణాగుణదానం, సృష్టిలోని సచరాచర ప్రపంచానికి ప్రేమదానం, ఇలా అనేక అంశాలలో తన దానగుణాన్ని, ఔదార్యాన్ని, వదాన్యతను యిబ్బడిముబ్బడిగా చేసి, “వళ్ళలార్” అన్న అన్వర్థనామధేయుడైనారు. రామలింగం



దానగుణప్రస్తావన వచ్చినప్పుడు ఒక శిబిచక్రవర్తిని, ఒక కర్ణుణ్ణి మనం జ్ఞాపకం చేసుకొంటాము. అట్లాగే శ్రీ మంచులింగస్వామి కూడా, ప్రతిష్ఠితుడైనారు. ఆయన్ని “తిరుఅరాట్ప్రకాశవళ్ళలార్” (శ్రీ జ్ఞానజ్యోతి దానగుణ శేఖరులు) అని తమిళదేశం కొనియాడుతోంది.

**16.** వీరిని చిదంబరం రామలింగస్వామి అని కూడా పేర్కొనడం కద్దు.

**17.** పందొమ్మిదోశతాబ్దిలోని సుప్రసిద్ధులైన దివ్య పురుషులలో ఒక్కరు శ్రీరామలింగం. ఈ శతాబ్దిలో విఖ్యాతి కెక్కిన ఆధ్యాత్మికత సంఘసంస్కరణల నభిలషించి అత్యుత్తమ సాహిత్యాన్ని సృజించిన కవితల్లజు డీయన.

**18.** కులభేదాలను పాటించడం అమానవీయమని ప్రచారం చేయడంతో బాటు నిత్యమూ ఆచరించి ఆదర్శంగా నిలిచిన మానవోత్తములు రామలింగస్వామి.

**19.** స్వామి ప్రతిపాదించిన తత్త్వం “ శుద్ధ సన్మార్గం” మానవజీవితధ్యేయం ప్రేమతో కూడుకున్న దానశీలత. దీనితో ప్రగతి సాధించి భగవత్ కైంకర్యం చేస్తూ పరిశుద్ధమైన జ్ఞానాన్ని ఆర్జించడం ఇక్కడ ముఖ్యాంశం.

**20.** శుద్ధ అహింసా మార్గానుసారి స్వాములవారు. ఆయన ఇలా అనేవారు “మనుష్యులు మాంసాహారం తీసుకోవడం చూచినప్పుడల్లా నా మనసు ఎంతో సంక్షోభానికి గురి అవుతున్నది”. అని

**21.** స్వామి స్థాపించిన “ సత్యజ్ఞానసభా” (వడలూరు, జనవరి 25, 1872) ప్రముఖోద్దేశ్యము. “మానవసేవద్వారా మోక్షప్రాప్తి” అని ప్రపంచానికి చాటడం.

**22.** భగవంతుడు “అరుల్ పెరుంజ్యోతి” అని స్వామి నిర్వచనం అంటే “కరుణ, జ్ఞానం –వీటి రూపమే భగవంతుడు.

**23.** దయా, కరుణల మార్గమే భాగవత్సన్నిధానానికి చేర్చే ఏకైకమార్గం.

**24.** క్రీ.శ 1870 లో స్వామి స్థాపించిన “సత్యజ్ఞానసభ” ఒక దైవమందిరంకాదు. అక్కడ పూజలకు, నైవేద్యాలకు అవకాశంలేదు. అక్కడ దీవెనలు కూడా కురియవు.

శాకాహారులెవరైనా, ఏ కులస్థులైనా, ఏ వర్గంవారైనా ఆ సభలో ప్రవేశించడానికి అర్హులు. మాంసాహారులు వెలుపలివరకు రావచ్చు.

**25.** స్వామి అనేవారు "మనం జ్ఞానం, జ్ఞానం అని దేన్ని అంటున్నామో, అది మాయాజ్ఞానం. అది నిజమైన జ్ఞానం కాదు. జ్ఞానం తాలూకు పరాకాష్ఠకాదు.

**26.** ఆర్తులకు అన్నదానం చేయడమంటే, ఒక మహోన్నతస్థాయి దైవపూజ చేయడంతో సమానం.

**27.** జన్మతః ఏర్పడిన ఉత్తమత్వం, అధమత్వం గర్హణీయమన్నారు స్వామి.

**28.** ఒక గొప్పకవిగా, అద్భుతమైన గాయకులుగా స్వామి 5818 పద్యాలను కూర్చారు. విశ్వమానవ ప్రేమ శాంతి ప్రధానంగా ఆధ్యాత్మికతత్వాలు అడుగడుగున నినదించే మహోజ్జ్వల కవితా కదంబాలవ్వి. ఈ కవితా కదంబం పేరు "తిరుఅరుప్పా" (The holy book of Grace)

**29.** మేట్టుకుప్పం, సిద్ధివళీకం ఆశ్రమంలో 1873 అక్టోబరు 22న స్వామి ఇచ్చిన చివరి సందేశం మానవాళికి ఒక వరప్రసాదం. "మన అవగాహన కతీతమై, మనల్ని చైతన్యవంతులుగా చేసే శక్తి ఏదైతే ఉన్నదో దాన్ని గురించి మనం తెలుసుకోవాలి"అని చెప్పినతర్వాత తనగదిలో ఉంచుకొని పూజించి, ధ్యానించిన జ్యోతిని, వెలుపలకి తెచ్చి, ఆ జ్యోతిమీద ధ్యానం చేయుమని ఉపదేశించారు స్వామి.